ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

అనకాపల్లి
జిల్లా వార్తలు
శుక్రవారం 30 మే 2025

86 మంది హెచ్ఎంలు బదిలీ

» 67 మంది టీచర్లకు గ్రేడ్-2 హెచ్ఎంలుగా పదోన్నతి

విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో జడ్పీ, మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో 86 మంది గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు బదిలీ అయ్యింది. వీరిలో జడ్పీ పాఠశాలల హెచ్ఎంలు 71 మంది, మునిసిపల్ పాఠశాలల హెచ్ఎంలు 15 మంది ఉన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లాలో 67 గ్రేడ్-2 హెచ్ఎం పోస్టులకు గురువారం కౌన్సెలింగ్ ... మిగతా 8వ పేజీలో

వరి రైతుకు దక్కని మద్దతు

సాగు వ్యయం బారెడు.. పెంచిన మద్దతు ధర జానెడు

» కంటితుడుపుగా ధాన్యం మద్దతు ధర
» క్వింటాకు రూ.69 మాత్రమే పెంపు
» క్రితం ఏడాది కన్నా రూ.48 తక్కువ
» గత ఐదేళ్లలో ఇదే అత్యల్పం
» మిగిలిన అన్ని పంటలకన్నా వరికే తక్కువ మద్దతు ధర పెంపు
» అన్నదాతలను నిరాశపరిచిన కేంద్ర ప్రభుత్వం

గత తొమ్మిదేళ్లలో ధాన్యం మద్దతు ధరలు

సంవత్సరం	సాధారణ రకం	ఏ గ్రేడ్ రకం
2016-17	రూ.1,470	రూ.1,510
2017-18	రూ.1,550	రూ.1,590
2018-19	రూ.1,750	రూ.1,770
2019-20	రూ.1,815	రూ.1,835
2020-21	రూ.1,868	రూ.1,888
2021-22	రూ.1,940	రూ.1,960
2022-23	రూ.2,040	రూ.2,060
2023-24	రూ.2,183	రూ.2,203
2024-25	రూ.2,300	రూ.2,320
2025-26	రూ.2,369	రూ.2,389



చోడవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బుధవారం ప్రకటించిన ధాన్యం మద్దతు ధరలు అన్నదాతలను తీవ్ర నిరాశకు గురిచేశాయి. పెరిగిన పెట్టుబడులతో బేరీజు వేస్తే మద్దతు ధరల పెంపు కంటి తుడుపుగానే వుందని పెదవి విరుస్తున్నారు. గత ఏడాది ధరలపై క్వింటాకు కేవలం రూ.69 మాత్రమే పెంచడం శోచనీయమని అంటున్నారు. వాస్తవ సాగు వ్యయానికి, పెంచిన మద్దతు ధరలకు పొంతన లేదని వాపోతున్నారు. పెట్టుబడుల వ్యయం 10 నుంచి 15 శాతం వరకు పెరగ్గా, ధాన్యం మద్దతు ధరలను మాత్రం మూడు శాతమే పెంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన 17 రకాల పంటల మద్దతు ధరల్లో వరి చివరి స్థానంలో వున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం తాజాగా పెంచిన ధరల ప్రకారం సాధారణ రకం ధాన్యంకు క్వింటా రూ.2,369, ఏ గ్రేడ్ రకం క్వింటా రూ.2,389. గత ఏడాది ఇవే రకాలు రూ.2300, రూ.2320గా వున్నాయి. అంతకుముందు సంవత్సరం (2023-24) క్వింటాకు రూ.117 పెంచగా, ఈసారి రూ.69 మాత్రమే పెంచింది. విత్తనాలు, కూలి ఖర్చులు, ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ఇటువంటి తరుణంలో మద్దతు ధర కనీసం పది శాతం అయినా పెంచాల్సి వుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. కానీ గతంలో ఎన్నడూ లేనివిధంగా మూడు శాతం మాత్రమే పెంచి, కేంద్ర ప్రభుత్వం తమను తీవ్ర నిరాశపరిచిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు వరి సాగు వ్యయం ఏటేటా పెరిగిపోతుండగా, మరోవైపు తుఫాన్లు, భారీ వర్షాలు, తెగుళ్ల వంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా ధాన్యం దిగుబడులు తగ్గిపోతున్నాయి. యూరియా మినహా, ఇతర ఎరువులు, పురుగు మందుల ధరలు పెరుగుతూ వస్తున్నాయి. వివిధ కారణాల వల్ల గ్రామాల్లో వ్యవసాయ పనులకు వచ్చే వారి సంఖ్య తగ్గిపోతున్నది. ఈ కారణంగా కూలి రేట్లు పెరుగుతున్నాయి. అయినాసరే అవసరమైన సమయంలో కూలీలు లభించడంలేదు. గతంలో రోజు కూలీకి వరినాట్లు వేసేవారు. ఎకరాకు రూ.2,000 వరకు ఖర్చు అయ్యేది. ఇప్పుడా పరిస్థితి లేదు. గుత్తంగా ఎకరాకు రూ.5-6 వేలు డిమాండ్ చేస్తున్నారు. దుక్కి దున్నడానికి ట్రాక్టర్‌కు ఎకరాకు రూ.1,000 నుంచి రూ.1,200 తీసుకుంటున్నారు. దమ్ము పని అయితే రూ.1,200-రూ.1,500 వుంది. ఎకరా విస్తీర్ణంలో వరి సాగు చేయాలంటే రూ.35-40 వేలు వ్యయం అవుతున్నది. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు అటు ఇటుగా 20 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుంది. తెగుళ్లు ఆశించినా, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా.. దిగుబడి మరింత తగ్గిపోతుంది. ఇటువంటి తరుణంలో వరి రైతుకు గిట్టుబాటు అయ్యేలా మద్దతు ధర పెంచాల్సిన ప్రభుత్వం.. అత్యంత దారుణంగా క్వింటాకు రూ.69 మాత్రమే పెంచడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ కారణంగానే వరి సాగుకు స్వస్తి చెప్పి సరుగుడు, యూకలిప్టస్ తోటలు వేసుకుంటున్నామని చెబుతున్నారు.

వరి మద్దతు ధర రూ.3,500 ఉండాలి

వరి సాగు ఖర్చులు గత నాలుగైదేళ్ల నుంచి విపరీతంగా పెరిగిపోతున్నాయి. కుటుంబ సభ్యులు సైతం పొలంలో పనులు చేసుకుంటున్నప్పటికీ ఇతర ఖర్చులన్నీ కలిసి రూ.30 వేలకు తగ్గడంలేదు. ఇటువంటి పరిస్థితుల్లో ధాన్యం క్వింటా రూ.3,500 అయితేనే వరి సాగు గిట్టుబాటు అవుతుంది. లేదంటే ఎరువులు, విత్తనాలను సగం రాయితీపై అందజేయాలి. వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలి.
యల్లపు శ్రీను, చోడవరం



రెవెన్యూ బదిలీలకు రంగం సిద్ధం

ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 68 మంది దరఖాస్తు

» ఏజెన్సీ నుంచి నగరానికి రావడానికి పలువురు ఎదురుచూపు
» నగరం నుంచి అల్లూరి జిల్లాకు వెళ్లడానికి ఎక్కువ మంది విముఖత
» సమావేశమైన మూడు జిల్లాల కలెక్టర్లు

విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో రెవెన్యూ ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. జూన్ 2వ తేదీలోగా బదిలీలను చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో తహశీల్దార్ నుంచి అటెండర్ వరకు మొత్తం 68 మంది ఉద్యోగులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిని పరిశీలించి విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తుది జాబితాను ఖరారు చేయాలి. ఈ నేపథ్యంలో గురువారం కలెక్టర్ అధ్యక్షతన విశాఖ నగరంలో జరిగిన సమావేశంలో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు విజయ కృష్ణన్, దినేశ్‌కుమార్‌లు పాల్గొన్నారు. మూడు జిల్లాల పరిధిలో ప్రస్తుతం ఉన్న ఖాళీలు, ఐదేళ్లకు మించి ఒకేచోట పనిచేసిన డీటీలు/సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ఎంతమంది ఉన్నారు..? అనేది జాబితా రూపొందించి వారికి స్థానచలనం కల్పించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు నివేదికలను సిద్ధం చేస్తున్నారు. గత ఏడాది బదిలీల్లో ఏజెన్సీ నుంచి విశాఖ/అనకాపల్లి జిల్లాలకు బదిలీ అయిన ... మిగతా 8వ పేజీలో

నిధులకు నిరీక్షణ

పెండింగ్‌లో రూ.132 కోట్ల ఉపాధి బిల్లులు

» జిల్లాలో 166 కిలోమీటర్ల పొడవున 1,354 రోడ్ల నిర్మాణం
» మొత్తం వ్యయం రూ.143 కోట్లు
» ఇంతవరకు రూ.11 కోట్లు మాత్రమే చెల్లింపు
» మిగిలిన పనులు చేయడానికి ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు


సబ్బవరంలో నిర్మాణం పూర్తయి రెండు నెలలు అయినా బిల్లు అందని సిమెంట్ రోడ్డు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టిన రోడ్ల పనులకు సంబంధించి బిల్లుల బకాయిలు పేరుకుపోతున్నాయి. జిల్లాలో 166 కిలోమీటర్ల పొడవున 1,354 రోడ్ల నిర్మాణ పనులు పూర్తికాగా, వీటికి రూ.143 కోట్లు ఖర్చు చేసినట్టు అధికారులు బిల్లులు అప్‌లోడ్ చేశారు. ఇంతవరకు రూ.11 కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయి. ఇంకా రూ.132 కోట్లు పెండింగ్‌లో వున్నాయి.

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడాది నవంబరు నుంచి పెద్దఎత్తున సిమెంట్, తారు రోడ్ల నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద 189 కిలోమీటర్ల పొడవుగల 1,734 రోడ్ల నిర్మాణ పనులు మంజూరయ్యాయి. పంచాయతీరాజ్ ఇంజనీర్ల పర్యవేక్షణలో పల్లెపండుగ పేరుతో పనులు ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కాబట్టి బిల్లులు త్వరగా మంజూరవుతాయన్న ఉద్దేశంతో కాంట్రాక్టర్లు పోటీపడి మరి గ్రామాల్లో పనులు చేపట్టారు. ఫిబ్రవరి 15వ తేదీ నాటికి జిల్లాలో 166 కిలోమీటర్ల పరిధిలో 1,354 రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. వీటికి సంబంధించి రూ.143 కోట్లు విడుదల చేయాలంటూ ఉపాధి హామీ పథకం వెబ్‌సైట్‌లో బిల్లులు అప్‌లోడ్ చేశారు. మార్చి నెలాఖరునాటికి నిధులు విడుదల అవుతాయని భావించారు. కానీ ఇంతవరకు రూ.11 కోట్లు మాత్రమే బిల్లుల చెల్లింపులు జరిగాయి. ఇంకా రూ.132 కోట్లు చెల్లింపులకు నోచుకోలేదు. దీంతో మిగిలిన రోడ్ల పనుల్లో కొన్ని ఆగిపోగా, మరికొన్ని పనులు మందకొడిగా సాగుతున్నాయి. పనులు పూర్తి చేయాలంటూ ఇంజనీర్లు నోటీసులు జారీ చేస్తున్నా, పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. ఈ ప్రభావం రావికమతం, నాతవరం, రోలుగుంట, గొలుగొండ, దేవరాపల్లి మండలాల్లో ఎక్కువగా కనిపిస్తున్నది.

రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటికీ ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో మిగిలిన పనులు పనులు పూర్తి చేసేందుకు కాంట్రాకర్లు ముఖం చాటేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాకు చెందిన మంత్రి, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పెండింగ్ బిల్లులు చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాగా పెండింగ్ బిల్లుల విషయాన్ని పీఆర్ ఈఈ వీరన్నాయుడు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ప్రస్తావించగా... రోడ్ల పనులు ఒకింత నెమ్మదిగా జరుగుతున్న మాట వాస్తవమేనని, అయితే పూర్తిగా నిలిచిపోలేదన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. త్వరలో నిధులు విడుదలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆయిల్ పామ్ తోటల్లో గంజాయి డెన్

పక్కా సమాచారంతో పోలీసుల దాడులు

» 750 కిలోల గంజాయి స్వాధీనం
» తొమ్మిది మంది అరెస్టు, ఇద్దరు పరారీ
» ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాలో కొనుగోలు
» సీలేరు, మారేడుమిల్లి మీదుగా రోలుగుంట మండలానికి చేరిక
» కొంతలం- అడ్డసరం మధ్య ఆయిల్ పామ్ తోటల్లో నిల్వ


స్వాధీనం చేసుకున్న గంజాయి, పట్టుకున్న నిందితులతో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, పోలీసు అధికారులు, సిబ్బంది

రోలుగుంట/ అనకాపల్లి రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): **రోలుగుంట మండలం కొంతలం- అడ్డసరం గ్రామాల మధ్య వున్న ఆయిల్ పామ్ తోటల్లో గురువారం తెల్లవారుజామున పోలీసులు దాడులు నిర్వహించి 750 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి తొమ్మిది మందిని అరెస్టు చేశారు. ఒక కారు, మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడించారు.**

రోలుగుంట మండలం గొల్లపేటకు చెందిన వియ్యపు గోవింద, మాకవరపాలెం మండలం చంద్రయ్యపాలెం గ్రామానికి చెందిన బంగారు అప్పలనాయుడు కలిసి ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా కలిమెల గ్రామానికి చెందిన పాపుల వెంకటేశ్ నుంచి ఇటీవల 750 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. అక్కడి నుంచి గంజాయిని రోలుగుంట మండలానికి తరలించడానికి అల్లూరి సీతారామరాజు జిల్లా, జీకేవీధికి చెందిన మడుల శివకుమార్, మరిగెల లక్ష్మణ్‌రెడ్డి కారును సమకూర్చారు. గంజాయిని ఇక్కడకు చేర్చడానికి, నిల్వ చేయడానికి రోలుగుంటకు చెందిన తమరాన వెంకట శ్రీనివాస రాజా, రోలుగుంట మండలం అంట్లపాలెం గ్రామానికి చెందిన ... మిగతా 8వ పేజీలో

వెన్నెలపాలెం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

» డీపీవో ఉత్తర్వులు జారీ
» కల్యాణ మండపం అద్దెల ఆదాయంలో రూ.21,97,689 దుర్వినియోగం

పరవాడ, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నెలపాలెం పంచాయతీ సర్పంచ్ వెన్నెల అప్పారావు చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) ఆర్.శిరీషారాణి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారని పంచాయతీ విస్తరణాధికారి కె.ధర్మారావు తెలిపారు. పంచాయతీ ఆధీనంలోని ఏసీ కల్యాణ మండపం అద్దెల ద్వారా 2019 ఫిబ్రవరి నాలుగో తేదీ నుంచి 2024 అక్టోబరు ఒకటో తేదీ వరకు రూ.69,38,255 ఆదాయం రాగా దీనిలో సుమారు రూ.21,97,689 దుర్వినియోగమైనట్టు విచారణలో తేలిందన్నారు. కల్యాణ మండపం అద్దె డబ్బులను పంచాయతీ ఖజానాకు జమ చేయకుండానే సర్పంచ్, కార్యదర్శి కలిసి స్వాహా చేశారని పేర్కొన్నారు. దీనిపై వెన్నెలపాలెం గ్రామానికి చెందిన గొంప మారునాయుడు గత ఏడాది కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టగా రూ.21 లక్షలకుపైగా నిధులు దుర్వినియోగమైనట్టు విచారణలో తేలిందన్నారు. దీనిపై 15 రోజుల్లోగా లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వాలని సర్పంచ్, అప్పటి కార్యదర్శి వరలక్ష్మిలకు ఈ నెల ఎనిమిదో తేదీన డీపీవో ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. గడువు ముగిసినా సర్పంచ్ వివరణ ఇవ్వకపోవడంతో 90 రోజులపాటు అతని చెక్‌పవర్ రద్దు చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. చెక్‌పవర్‌ను తాత్కాలికంగా పంచాయతీ విస్తరణాధికారికి అప్పగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారని ఆయన వెల్లడించారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

అభివృద్ధి పనులపై తీవ్రస్థాయిలో వాదోపవాదాలు

» వైస్ చైర్మన్ రామకృష్ణ, టీడీపీ కౌన్సిలర్ మధు మధ్య మాటల యుద్ధం


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి

» టీడీపీ సభ్యుడు మైక్‌తో దాడికి యత్నించడంతో ఉద్రిక్తత
» ఇరువురిని అదుపు చేసిన అధికారులు, పోలీసులు

నర్సీపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): **మునిసిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. ఎవరి హయాంలో అభివృద్ధి పనులు జరిగాయన్న దానిపై సభ్యుల మధ్య చర్చ నడుస్తుండగా.. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణపై టీడీపీకి చెందిన 24వ వార్డు కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు మైక్‌తో దాడికి యత్నించడం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. మునిసిపల్ అధికారులు, పోలీసులు వెంటనే స్పందించి పరిస్థితిని అదుపుచేయాల్సి వచ్చింది.**


వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మీదకు వెళుతున్న దనిమిరెడ్డి మధుని అడ్డుకుంటున్న పోలీసులు

మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సమావేశం జరిగింది. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ, ఎన్టీఆర్ సుజల ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులను తొలగించి వారి స్థానంలో డ్వాక్రా మహిళలను ఎందుకు నియమిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. 15వ వార్డు వైసీపీ కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర మాట్లాడుతూ, 2015 నుంచి ఆర్వో ప్లాంట్లు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్న వారిని తొలగించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ, ఎన్టీఆర్ సుజల పథకంలో భాగంగా ఆర్వో ప్లాంట్లు పెట్టినప్పుడు వారితో ఎటువంటి అగ్రిమెంట్లు జరగలేదని అన్నారు. దీనివల్ల ఆర్వో ప్లాంట్ల నుంచి సరఫరా చేసే నీటి వల్ల ప్రజలకు ఏమైనా ఇబ్బంది కలిగితే మునిసిపాలిటీ అధికారులు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని అన్నారు. అందువల్ల ఇప్పుడు కొత్తవారికి ఆర్వో ప్లాంట్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించి పక్కాగా అగ్రిమెంట్ ... మిగతా 8వ పేజీలో

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా కోన తాతారావు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

» వచ్చే నెల 27 నుంచి చైర్‌పర్సన్ ఇన్‌చార్జి హోదా?

విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా కోన తాతారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. కోన తాతారావు పర్సన్ ఇన్‌చార్జిగా వచ్చే నెల 26వ తేదీ వరకు ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వం గత ఏడాది డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్‌ను నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు వచ్చే నెల 26వ తేదీ వరకు అమల్లో వుంటాయి. అందువల్ల జేసీ స్థానంలో కోన తాతారావును నియమించారు. వచ్చే నెల 27వ తేదీ నుంచి ఆరు నెలల కాలానికి మరో జీవో తరువాత జారీచేస్తారు. సాధారణంగా డీసీసీబీ పాలకవర్గాన్ని అనధికార వ్యక్తులతో భర్తీ చేసేటప్పుడు చైర్‌పర్సన్ ఇన్‌చార్జి, మరో ఆరుగురు పర్సన్ ఇన్‌చార్జిలుగా (సభ్యులు) నియమించాలి. అయితే ప్రభుత్వం ఒక్కరినే నియమించడంతో కోన తాతారావును పర్సన్ ఇన్‌చార్జిగా పరిగణిస్తారు. వచ్చే నెలలో జారీచేయనున్న జీవోలో మొత్తం ఏడుగురితో పాలకమండలిని నియమించిన తరువాత కోన తాతారావును చైర్‌పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు

తినుబండారాల ధరలు అధికంగా ఉన్నట్టు గుర్తింపు


రామచంద్ర థియేటర్‌లో లైసెన్స్ పత్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో ఆయిషా

అనకాపల్లి టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు థియేటర్లను ఆర్డీవో షేక్ ఆయిషా, తహసీల్దార్ విజయ్‌కుమార్ గురువారం వేర్వేరుగా తనిఖీ చేశారు. పర్తిసాయి, షిర్డిసాయి, సత్యనారాయణ థియేటర్‌లను తనిఖీ చేసిన తహసీల్దార్.. తినుబండారాల ధరలు అధికంగా ఉన్నట్టు అభిప్రాయపడ్డారు. దీనిపై థియేటర్ల నిర్వాహకులకు హెచ్చరికలు చేశామన్నారు. లైసెన్సులు, పారిశుధ్య పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆర్డీవో షేక్ ఆయిషా రామచంద్ర థియేటర్‌ను తనిఖీ చేశారు. లైసెన్సు గడువు ముగుస్తున్నందున రెన్యూవల్ చేయించుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకున్నామని వారు చెప్పగా, ఆ దరఖాస్తును శుక్రవారం ఉదయం కార్యాలయంలో సమర్పించాలని ఆర్డీవో ఆదేశించారు. థియేటర్ లోపల కూడా పరిశీలించి సీటింగ్ కెపాసిటీ, ఎగ్జిట్ ద్వారాలపై ఆరా తీశారు. టికెట్ కలెక్షన్ వివరాలను అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇనివ్వాలని స్పష్టం చేశారు. తినుబండారాల ధరల పట్టికను పరిశీలించి నిర్వాహకులను ఆరా తీశారు. ఆమె వెంట తహసీల్దార్ విజయ్ కుమార్, ఆర్ఐ రమేశ్, సిబ్బంది ఉన్నారు.

పరవాడలో..

పరవాడ, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు పరవాడ సీతారామయ్య సినీ కాంప్లెక్స్ థియేటర్‌లో తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్ గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా థియేటర్‌లో ప్రేక్షకులకు కల్పిస్తున్న వసతులు, టికెట్ల ధరలు, పార్కింగ్ ఫీజు, తినుబండరాల ధరలు, మరుగుదొడ్ల నిర్వహణపై తనిఖీలు చేపట్టారు. థియేటర్ లైసెన్సుతో పాటు నిబంధనలు సక్రమంగా పాటిస్తున్నారా లేదా అన్నది ఆరా తీశారు. అన్నీ సక్రమంగానే వున్నట్టు ఆయన నిర్ధారించారు.

సీఎం చంద్రబాబుపై నమ్మకంతోనే రాష్ట్రానికి పెట్టుబడులు


టీడీపీ మహానాడు ముగింపు సభలో ప్రసంగిస్తున్న మంత్రి వంగలపూడి అనిత

విశాఖపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై వున్న నమ్మకంతో పలువురు పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. కడపలో జరుగుతున్న మహానాడు చివరి రోజు గురువారంనాడు ఆమె మాట్లాడుతూ, రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అణిచివేసి పెట్టుబడులు తీసుకువచ్చిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందని అన్నారు. మహానాడులో తీర్మానించిన ఆరు శాసనాలు, గ్రామాలకు వెళ్లేలా మంత్రులమంతా బాధ్యత తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

మరీ ఇంత దారుణమా?

- ఈపీడీసీఎల్ అధికారులపై మండిపడుతున్న జనం
- నిర్వహణ పేరుతో విద్యుత్ సరఫరా నిలిపివేత
- సమయ పాలన పాటించని విద్యుత్ శాఖాధికారులు
- ఎలమంచిలిలో 9 గంటలు..
- అచ్యుతాపురంలో 11 గంటలు నిలిచిన సరఫరా
- నీటి కోసం అల్లాడిన ప్రజలు...జరగని వ్యాపారాలు

ఎలమంచిలి/అచ్యుతాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. విద్యుత్ లైన్ల నిర్వహణ పేరిట ఇష్టారాజ్యంగా సరఫరాను నిలిపివేయడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా పగలు 9 గంటల నుంచి 11 గంటలపాటు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణ పేరిట ప్రతీ వారం పనులు చేస్తున్న గంటల తరబడి విద్యుత్ సరఫరాను నిలిపివేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. అసలే వేసవి కాలం.. ఆపై ఉక్కపోతతో అల్లాడుతుంటే విద్యుత్ సరఫరా లేకుంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఇళ్లు, అపార్టుమెంట్లలో నీరు అయిపోతే బోర్లు కూడా వేయలేకుండా పోతున్నామని, కనీసం స్నానం చేయడానికి కూడా ఇబ్బందిగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ఆధారంగా పనిచేస్తున్న వ్యాపారాలు పడిపోతున్నాయి.

ఎలమంచిలి మునిసిపాలిటీలో గురువారం 9 గంటపాటు విద్యుత్ సరఫరాను నిలిపేశారు. ముందస్తు సమాచారం ఇస్తున్నప్పటికీ కంటిన్యూగా గంటల తరబడి సరఫరా నిలిపేయడంతో అన్నివర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అలా కాకుండా విద్యుత్ నిర్వహణ పనుల కోసం రోజుకు నాలుగు గంటల లోపు సరఫరా ఆపితే పర్వాలేదని వారంటున్నారు. గురువారం రోజంతా 9 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తే తాము ఏవిధంగా వ్యాపారాలు చేసుకోవాలని పలువురు వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ లేకపోవడంతో ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి నెలకొందని ప్రజలు అంటున్నారు. కొత్త లైన్ల పేరుతో రోజంతా విద్యుత్ సరఫరాను నిలిపివేయడం ఇటీవల పరిపాటిగా మారిందని ఈపీడీసీఎల్ అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

అచ్యుతాపురంలో 11 గంటలు..

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో విద్యుత్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిర్వహణ పేరుతో


ఎలమంచిలిలో ఇళ్లలో ఉండలేక బయట సేదదీరుతున్న మహిళలు



అచ్యుతాపురంలో గురువారం రాత్రి 7 గంటలకు విద్యుత్ రాని దృశ్యం

విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ముందస్తు ప్రకటనలు చేస్తున్నా.. సమయపాలన పాటించడం లేదు. దీంతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు ప్రకటించారు. కాని రాత్రి ఎనిమిది గంటల వరకు సరఫరా పునరుద్ధరించలేదు. ప్రస్తుతం అంతా బోర్ల నీరుపైనే ఆధారపడుతున్నారు. 12 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నీటి కోసం జనం అల్లాడిపోయారు. అపార్టుమెంట్లలో లిఫ్టులు పనిచేయక, ఇంట్లో ఉండలేక నానా అవస్థలు పడ్డారు. విద్యుత్ పనుల నిర్వహణను ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. దీంతో కాంట్రాక్టరు చీకటి పడే వరకు కూలీలతో పనులు చేయిస్తున్నారు. ఇది విద్యుత్ వినియోగదారులకు ప్రాణ సంకటంగా మారింది. దీనికి విద్యుత్ శాఖాధికారులు సహకరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ శాఖాదికారులు నిర్లక్ష్యం కారణంగా వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి రోజంతా కాకుండా ఒక పూట విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో ఆర్‌డీడీ సమీక్ష

ఎలమంచిలి, మే 29 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయంలో గురువారం టౌన్ ప్లానింగ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పి. నాయుడు పట్టణ ప్రణాళిక విభాగం, సచివాలయ సెక్రటరీలతో సమీక్ష నిర్వహించారు. మునిసిపాలిటీలో భవన నిర్మాణ అనుమతులపై నూతన జీవోలను వివరించి, వాటిపై సూచనలు చేశారు. ప్రజలకు సత్వర సేవలు అందించాలని, అదేసమయంలో నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవన్నారు. పలు అంశాలపై మరిన్ని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీటీపీ డి.రామానాయుడు, కమిషనర్ ప్రసాదరాజు, టీపీవో శ్రీలక్ష్మి పాల్గొన్నారు.


మునిసిపల్ కార్యాలయంలో రివ్యూ నిర్వహిస్తున్న ఆర్‌డీడీ నాయుడు

ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద నిర్మాణాలపై ఎమ్మెల్యే ఆరా

ఎలమంచిలి, మే 29 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని కోర్టుపేట ప్రాంతంలో ఉన్న రోడ్లు, భవనాల శాఖ అతిథిగృహం వద్ద నిర్మించిన ఇళ్ల నిర్మాణాలను గురువారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పరిశీలించారు. అతిథి గృహానికి ఆనుకుని ఉన్న నిర్మాణాలను పరిశీలించి, పూర్తిగా ఆరా తీయాలని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను ఆయన ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైతే ఊరుకునేది లేదని, నిబంధనల ప్రకారం నిర్మాణాలు ఉన్నాయా? లేదా? అన్నది పరిశీలించాలన్నారు. ఈ నిర్మాణాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో టౌన్ ప్రణాళికా విభాగం అధికారులు, సచివాలయ సిబ్బంది విచారణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీవో శ్రీలక్ష్మి, స్థానిక నేతలు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

'పేట' చేరుకున్న ప్రేమ వాహిని రథయాత్ర


పాయకరావుపేటలో ప్రేమ వాహిని రథయాత్ర సాగుతున్న దృశ్యం

పాయకరావుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో భాగంగా చేపట్టిన ప్రేమ వాహిని రథయాత్ర బుధవారం రాత్రి పాయకరావుపేట చేరుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో పుట్టపర్తిలో ప్రారంభమైన రథయాత్ర గత మూడు రోజులుగా అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా కొనసాగుతూ బుధవారం రాత్రి పాయకరావుపేట చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక వై జంక్షన్ వద్ద రథయాత్రకు పాయకరావుపేట సత్యసాయి భజన మండలి సభ్యులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డు మీదుగా తాండవ వంతెన వరకు రథయాత్ర వైభవంగా సాగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కసిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ సత్యసాయి శత జయంత్యుత్సవాల సందర్భంగా కన్యాకుమారి వరకు ఐదు రథాలతో సత్యసాయి ప్రేమ వాహిని రథయాత్ర చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ పి.రమేష్‌బాబు, పలువురు జిల్లా ప్రతినిధులు, అనకాపల్లి, రుక్మిణీపురం, నక్కపల్లి, వేంపాడు, పాయకరావుపేటకు చెందిన 150 మంది భక్తులు పాల్గొన్నారు.

మొరాయించిన బస్సు

- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు


మరమ్మతుకు గురై ఆగిపోయిన బస్సు

అచ్యుతాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన ఆర్టీసీ బస్సుల తో ప్రయణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ గాజువాక డిపోకి చెందిన బస్సు గురువారం మడుతూరు జంక్షన్ దాటిన నుంచి తీవ్ర ఇబ్బందికి గురిచేసింది. దీంతో 50 మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. గేరు సక్రమంగా పడక బస్సు తీవ్ర కుదుపులకు గురైంది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అయితే డ్రైవర్ చాకచక్యంగా కూర్మన్నపాలెం జంక్షన్ వరకు తీసుకువెళ్లి వేరే బస్సులో ప్రయాణికుల్ని పంపారు.

టీకాల స్పెషల్ డ్రైవ్ తనిఖీ


పెనుగొల్లు పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న చంద్రశేఖర్‌దేవ్

ఎస్.రాయవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాధి నిరోధిక టీకాల అధికారి కె. చంద్రశేఖర్‌దేవ్, జిల్లా స్టాటస్టిక్ ఆఫీసర్ రామచంద్రమూర్తి గురువారం పెనుగొల్లు పీహెచ్‌సీను సందర్శించారు. పీహెచ్‌సీలో చేపట్టిన చిన్నపిల్లల వ్యాధి నిరోధక టీకాల స్పెషల్ డ్రైవ్‌ను తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్, వ్యాధి నిరోధిక టీకాల ఫ్రిజ్‌లు, ఆపరేషన్ థియేటర్‌లో నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, చిన్నపిల్లల విషయంలో తీసుకోవలసిన ఆహారం, పలు రకాల రోగాలకు సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం వారు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ ప్రసాద్, వైద్య సిబ్బంది జయమ్మ, శ్రీనివాస్, ఆదినారాయణమూర్తి, సుబ్బారావు, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

నూతన వంగడాలు, సాంకేతికతతో అధిక దిగుబడులు

- ఐసీఏఆర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్

పాయకరావుపేట రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): నూతన వంగడాలు, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు ఉపయోగిస్తే రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చని రాజమండ్రి భారత వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్ అన్నారు. మండలంలోని ఆర్.కొత్తూరులో బీసీటీ, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆధునిక సాంకేతికత, నూతన విత్తనాలు రైతులను శక్తివంతంగా చేయడమే వికసిత కృషి సంకల్ప అభియాన్ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా రైతులకు వరిలో నూతన వంగడాలు, వ్యవసాయంలో ఆధునికత, సాంకేతిక పరిజ్ఞానం, అధిక దిగుబడులు ఎలా సాధించాలి.. తెగుళ్ల నివారణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ మాట్లాడుతూ సరైన యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే కొబ్బరి, జీడి మామిడి, మామిడి, తమల పాకుల తోటల్లో రైతులు మంచి దిగుబడులు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏడీఏ కె.ఉమాప్రసాద్, మండల వ్యవసాయాధికారి ఎ. ఆదినారాయణ, శాస్త్రవేత్తలు బండి నాగేంద్రప్రసాద్, ఎం.శివ, తాండవ ఎఫ్‌పీవో సీఈవో సత్యనారాయణ, జిల్లా వనరుల అధికారిణి విజేత, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, బీజేపీ నాయకుడు రవిరాజు, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐసీఏఆర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్

స్పేసెస్ డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా

- ఉత్తర్వులు జారీ చేసిన యూజీసీ

పాయకరావుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి స్వయంప్రతిపత్తి హోదా లభించింది. ఈ సందర్భంగా గురువారం విద్యా సంస్థల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ 2025-26 నుంచి 2034-35 వరకు అటానమస్ హోదాను యూజీసీ ఇచ్చిందన్నారు. కళాశాలలో సొంతంగా కోర్సులు రూపొందించుకుని సిలబస్‌ని అభివృద్ధి చేసి, పరీక్షలు నిర్వహించవచ్చునన్నారు. ఫలితాలు ప్రకటించుకునే అవకాశం కల్పించిందన్నారు. స్వయం ఉపాధి, స్వావలంబన ధ్యేయంతో పనిచేస్తున్న తమ విద్యా సంస్థకు ప్రతిష్ఠాత్మకమైన గుర్తింపు లభించడంతో గ్రామీణప్రాంత విద్యార్థులకు ఉన్నతవిద్యా ప్రమాణాలు, ఉపాధి అవకాశాలు మరింతగా అందుబాటులోకి వస్తాయన్నారు. శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కె.నరేంద్ర బాబు, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సీహెచ్‌వీకే.నరసింహారావు మాట్లాడుతూ స్వయం ప్రతిపత్తి హోదా ద్వారా విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపర్చే దిశగా కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.


యూజీసీ ఇచ్చిన ఆర్డర్‌ని చూపుతున్న సీహెచ్.విజయ్‌ప్రకాష్

ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలి : తహసీల్దార్


నక్కపల్లి : ఉపమాకలో యోగాసనాలు సాధన చేస్తున్న ఉద్యోగులు


మునగపాక కల్యాణ మండపంలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

కోటవురట్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగా సాదన జీవనంలో భాగంగా మార్చుకోవాలని తహసీల్దార్ తిరుమలబాబు అన్నారు. గురువారం యోగాంధ్రలో భాగగా కోటవురట్ల ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో వివిధ శాఖల ఉద్యోగులు యోగా ప్రోటోకాల్ వ్యసనాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మానసికం, శారీరక ఇబ్బందులు అధిగమించడానికి యోగా మంచి మార్గమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఈవోపీఆర్‌డీ రఘురామ్, ఎంఈవో రామారావు, జోషిలు, ఆరోగ్య శాఖ, వెలుగు, వ్యవసాయ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాక: యోగా సాధనతో మానసిక ప్రశాంతతపాటు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని తహసీల్దార్ ఆది ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక రాహుల్‌గాంధీ కల్యాణ మండపంలో గురువారం జరిగిన యోగా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సోమరాజు, మండల పరిషత్ ఏవో ప్రసాదరావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


అచ్యుతాపురంలో యోగా శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

రాంబిల్లి: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర శిక్షణ తరగతులు గురువారానికి మూడో రోజుకు చేరుకున్నాయి. శిక్షణకులు ఉద్యోగులను మూడు బ్యాచ్‌లుగా విభజించి యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జయమాధవి మాట్లాడుతూ యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ రాజు, వెలుగు ఏపీఎం పద్మ, పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: యోగాంధ్రలో భాగంగా అచ్యుతాపురం స్త్రీశక్తి భవన్‌లో గురువారం యోగా ప్రోటోకాల్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రతిరోజు యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి అధిగమించవచ్చునని పేర్కొన్నారు.

నక్కపల్లి: యోగా సాధనతో మనిషి జీవనశైలిలో అనూహ్యమైన మార్పులు సంభవిస్తాయని ఉపమాక దేవస్థానం ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు అన్నారు. గురువారం ఉపమాక దేవస్థానం వద్ద యోగాంధ్రలో భాగంగా యోగా ఆసనాల సాధన చేస్తున్న ఉద్యోగులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డీ సీతారామరాజు, యోగా గురువు రాంబాబు, మాస్టర్ ట్రైనీలు ఎన్‌వీఎస్ ఆచార్యులు, ఆదిత్య రుత్విక్ ప్రోటోకాల్ యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. అంతకుముందు ఉపమాకలో యోగాంధ్రపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీడీవో డీ సీతారామరాజు, ఆయుష్ డాక్టర్ కె.రఘు, ఏపీఎం శ్రీనివాసరావు, ఏపీవో భాగ్యవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత, ఈవోఆర్‌డీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పాత ఆస్పత్రి భవనంలో ప్రసూతి కేంద్రాన్ని నిర్వహించాలి

ఎలమంచిలి, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున ఉన్న పాత ప్రభుత్వ ఆస్పత్రి భవనాన్ని స్త్రీ ప్రసూతి వైద్య కేంద్రంగా వినియోగించేలా పాలకులు, అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. తులసీనగర్‌లో కోట్లాది రూపాయలతో నిర్మించిన నూతన సీహెచ్‌సీ వద్దకు వైద్య సేవలు పొందేందుకు రవాణా సదుపాయం లేకపోవడంతో పేదలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆస్పత్రి నుంచి జంక్షన్‌కు వచ్చేందుకు పగలు మాటెలా ఉన్నా.. రాత్రి వేళల్లో ఆటోలు కూడా రావడం లేదని పలువురు వాపోతున్నారు. అంతేకాకుండా ఆస్పత్రికి వెళ్లే వీధుల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని వారంటున్నారు. పేదల ఇబ్బందులను గుర్తించి అందరికీ అందుబాటులో ఉండి నిరుపయోగంగా ఉన్న పాత ఆస్పత్రి భవనంలో స్త్రీల ప్రసూతి కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా పునరాలోచన చేయాలని పలువురు కోరుతున్నారు.

కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం


కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠకు చేస్తున్న పూజలు

పాయకరావుపేట రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదరాంభద్రపురం లక్ష్మణస్వామి వారి కొండపై కోదండరామస్వామి వారి జీర్ణోద్ధరణ యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ పూజలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా హోమాలు, పూజలను ఆగమ పండితులు వాడపల్లి గోపాలాచార్య స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం సత్యనారాయణ ఆచార్యులు జరిపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శింగంశెట్టి నాగేశ్వరరావు, కలిగట్ల శ్రీనివాసరావు, నారపురెడ్డి కొండబాబు, మాజీసర్పంచ్ త్రిపర్ణ సత్యనారాయణ, త్రిపర్ణ రాజబాబు, దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలుగ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె రాజశేఖర్, ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. బ్రాండిక్స్ అపెరల్ సిటీ, ఇండస్ట్రియల్ ఏరియా, చిప్పాడ, పూడిమడక, జాలారిపాలెం, కొండపాలెం, సీతపాలెం, బార్క్, ఐవోసీఎల్, ఐటెక్, అభిజిత్ ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

2న అనకాపల్లిలో ఆపరేషన్ కగార్‌పై సదస్సు

ఎలమంచిలి, మే 29 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌పై జూన్ 2వ తేదీన అనకాపల్లి రోటరీ హాల్లో సదస్సు నిర్వహిస్తున్నట్టు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం తలపెట్టిన ఆపరేషన్ కగార్ వెనుక అటవీ సంపదలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడమే లక్ష్యంగా కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సన్యాసిరావు, జిల్లా సమితి సభ్యులు వియ్యపు రాజు, బి.బాబ్జి, స్థానిక నేత గోవిందమ్మ పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణంతో ట్రాఫిక్ మళ్లింపు


అచ్యుతాపురంలో ట్రాఫిక్‌ని మళ్లిస్తున్న పోలీసులు

అచ్యుతాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతుండడంతో గురవారం నుంచి ట్రాఫిక్‌ని మళ్లించామని సీఐ నమ్మి గణేష్ తెలిపారు. సెజ్ కర్మాగారాలకు వెళ్లే వాహనాలతోపాటు ఇతర వాహనాలు అచ్యుతాపురం జంక్షన్, వెదురువాడ, వెంకటాపురం జంక్షన్, సెజ్ పునరావాస కాలనీ మీదుగా ట్రాఫిక్‌ని మళ్లించామని తెలిపారు.

నేడు 7 గ్రామాలకు విద్యుత్ కట్

రాంబిల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల పనులు చేపట్టేందుకు ఈనెల 30వ తేదీన ఏడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటాపురం నుంచి రాంబిల్లి వరకు విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నట్టు చెప్పారు. అందువల్ల లాలంకోడూరు, అప్పన్నపాలెం, రాజుకోడూరు, వెల్చూరు, కృష్ణంపాలెం, ఆర్.నర్సాపురం, వీఆర్ అగ్రహారం గ్రామాల్లో విద్యుత్‌ను శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేస్తున్నట్టు రాజశేఖర్ ఆ ప్రకటనలో తెలిపారు.

3న ఎలమంచిలి మండల సమావేశం

ఎలమంచిలి, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వచ్చే నెల 3 వ తేదీన ఉదయం 10.30 గంటలకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఎంపీడీఓ కేఎస్. కొండలరావు తెలిపారు. ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలను వివరించడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు.

ఘనంగా కొత్తమ్మతల్లి జాతర


కొత్తమ్మతల్లికి పూజలు చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, తదితర నాయకులు

ఎస్.రాయవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురంలో కొత్తమ్మతల్లి జాతరను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. ఆలయానికి వచ్చిన మహిళలు పసుపు, కుంకుమలతో కొత్తమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, టీడీపీ నాయకుడు ముప్పిన శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకున్నారు. పలు వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రికి అమ్మవారి ఆలయం వద్ద చికెన్ బిర్యానీతో అన్నసమారాధన నిర్వహించారు.

ఆరు నెలలుగా తాగునీరు వృథా



పైపులైన్‌కు రంధ్రం పడటంతో బయటకు పోతున్న నీరు

పరవాడ, మే 29 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం మండలంలోని ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)కి తాగునీటి సరఫరా చేసే పైపులైన్‌కు ఎలమంచిలి-గాజువాక రహదారిలో స్థానిక టీ రాజా హోటల్ సమీపంలో రంధ్రం పడటంతో నీరు వృథా అవుతోంది. ఏలేరు కాలువ నుంచి తాడి గ్రామం సమీపంలోని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) పంప్‌హౌస్ ద్వారా సెజ్‌కు నీటి సరఫరా జరుగుతోంది. అయితే ఆరు నెలల క్రితం హోటల్ సమీపంలో భూమి అడుగుభాగాన పైపులైన్‌కు రంధ్రం పడటంతో పెద్ద ఎత్తున నీరు వృథా అవుతోంది. ప్రధాన రహదారి గుండా నీరు పారుతూ సమీపంలోని కల్వర్ట్ ద్వారా పక్కనే ఉన్న చెరువులోకి చేరుతోంది. పెద్ద ఎత్తున తాగునీరు వృథా అవుతున్నప్పటికీ పట్టించుకోకపోవడం ఏపీఐఐసీ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. వీరి తీరుకు స్థానికులు మండి పడుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ప్రగతి వెలుగుల్లేని రామన్నపాలెం కాలనీ



రామన్నపాలెం కాలనీలో రోడ్డుకు ఇరువైపులా కాలువలు లేని దృశ్యం

కశింకోట, మే 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న విస్సన్నపేట పంచాయతీ పరిధిలోని రామన్నపాలెం కాలనీలో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఈ కాలనీలో సుమారు 50 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. రోజూ ఉదయం కూలి పనుల నిమిత్తం చుట్టుపక్కల గ్రామాలకు, అనకాపల్లి పట్టణానికి వెళ్లి వస్తుంటారు. రాత్రి సమయంలో జాతీయ రహదారిని ఆనుకొని ఉండడంతో కాలనీలో విద్యుత్ దీపాలు లేక చీకటితో దర్శనమిస్తుంది. ఇంటి నుంచి బయటకు రావడానికి కాలనీవాసులు జంకుతున్నారు. గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించకపోవడంతో వాడుక నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోందని వాపోతున్నారు. వాడుక నీరు పోయేందుకు కొందరు సొంతంగా కాలువలు ఏర్పాటు చేసుకొని రోడ్డుపైకి నీటిని విడిచిపెడుతున్నారు. దీనివల్ల రాత్రి సమయంలో దోమలు విజృంభించి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వర్షం కురిసినప్పుడు మురుగునీటితో వర్షపునీరు కలిసిపోయి నిలిచిపోతోందని, విధి లేని పరిస్థితుల్లో ఈ నీటిలో నుంచే రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలో కాలువలు ఏర్పాటు చేసి, వీధి దీపాలు వెలిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : డీఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మోహనరావు

అనకాపల్లి టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ మోహనరావు స్పష్టంచేశారు. గురువారం స్థానిక రోటరీ క్లబ్ సమావేశమందిరంలో ఆటో డ్రైవర్లతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆటో ప్రమాదాల కేసుల్లో డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి మాట్లాడుతూ ప్రయాణికులను నిబంధనల మేరకు ఆటోల్లో గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. పరిమితికి మించి బరువుతో వెళితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గోపీకృష్ణ, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకట నారాయణ, కశింకోట, అనకాపల్లి రూరల్ సీఐలు స్వామినాయుడు, అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల పండుగ అనుపోత్సవం



గొర్లెవానిపాలెంలో బంగారమ్మతల్లి

సబ్బవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం శివారు గొర్లెవానిపాలెం గ్రామ ప్రజల ఆరాధ్య దేవతలు, భక్తుల పాలిట కొంగు బంగారం, కోర్కెలు తీర్చే కల్పవల్లి బంగారమ్మ, కుంచాలమ్మ అమ్మవార్ల పండుగ అనుపోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి ప్రజలు అమ్మవార్లను దర్శించుకొని దూప, దీప నైవేద్యాలతో విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు పెద్దఎత్తున అన్న సమారాధన జరిగింది. అనంతరం తప్పెటగుళ్ళు, కోలాటం, సాముగరిడీలు, నేలడ్యాన్స్‌లు బాణసంచా కాల్పులతో అమ్మవారి ఊరేగింపు, అనుపోత్సవం జరిగింది. రాత్రికి పలు సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు గండి దేముడు, ఎంపీటీసీ గొర్లి చైతన్య, రమణబాబు, త్రిమూర్తులు, విష్ణు, ప్రసాదు, సత్యనారాయణ, కొటాన బుజ్జి, గ్రామస్థులు పాల్గొన్నారు.

'రైతులపై నిర్లక్ష్యం తగదు'



మాట్లాడుతున్న కోరిబిల్లి శంకరరావు

తుమ్మపాల, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి కోరిబిల్లి శంకరరావు విమర్శించారు. గురువారం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ వస్తున్నప్పటికీ రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచకపోవడం దారుణమన్నారు. రైతు సేవా కేంద్రాలు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నాయన్నారు. పంట కాలువల మరమ్మతులపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. సీపీఐ నాయకులు రాజాన దొరబాబు, వియ్యపు రాజు పాల్గొన్నారు.



కడపలో మహానాడు వేదికపై గురువారం సీఎం చంద్రబాబునాయుడుతో గవర సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర

ఆంధ్రజ్యోతి-అనకాపల్లి

ఐక్యంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలి



నెహ్రూచౌక్‌లో నినదిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదం, మతోన్మాదాన్ని ఐక్యంగా ఎదుర్కోవాలని, లౌకికతత్వం, మత సామరస్యాన్ని కాపాడుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం అన్నారు. మత సామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణ కాంక్షిస్తూ గురువారం సీపీఎం చేపట్టిన సమైక్యత యాత్ర పార్టీ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా నెహ్రూచౌక్ వరకు సాగింది. ఈ ప్రదర్శనలో ఉగ్రవాదం, మతోన్మాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన నెహ్రూచౌక్‌లో జరిగిన సభలో లోకనాథం మాట్లాడారు. ఉగ్రవాదాన్ని సమైక్యంగా ఎదుర్కోవాల్సిన సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మైనార్టీలపై వ్యతిరేకతను నూరిపోస్తోందని ఆరోపించారు. దీని పర్యవసానంగా ఇటీవల కాలంలో ముస్లింలపై 112 దాడులు జరిగాయన్నారు. పహల్గాం ఉగ్రదాడి సమయంలో మతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా బాధితులకు సాయం చేశారన్నారు. బీజేపీకి మద్దతు ఇస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముస్లింలు పాకిస్థాన్‌కు వెళ్లిపోవాలంటూ ముస్లిం వ్యతిరేకతను మరింత రెచ్చగొడుతున్నారన్నారు. పవన్‌కల్యాణ్ అలా మాట్లాడటం సరికాదన్నారు. ఆపరేషన్ సిందూర్ ఆపేస్తున్నారని ప్రకటన చేయడానికి ట్రంప్ ఎవరని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.వెంకన్న, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ, ఆర్.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలపై నారా లోకేశ్ ఆరా



నారా లోకేశ్‌తో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

కొత్తూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): కడప మహానాడులో మూడో రోజు గురువారం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు కలిశారు. జిల్లాలో రాజకీయ పరిస్థితులు, అనకాపల్లి నియోజకవర్గంలో సమస్యలపై లోకేశ్ అడిగి తెలుసుకున్నారని ఆయన చెప్పారు. జరుగుతున్న అభివృద్ధి పనులు, సాగునీటి సమస్యలను ఆయనకు వివరించానన్నారు.

యోగాతో ఏకాగ్రత, చురుకుదనం



సబ్బవరంలో యోగాసనాలు వేస్తున్న రిసోర్స్ పర్సన్లు

అనకాపల్లి టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఏకాగ్రత, చురుకుదనం లభిస్తాయని జిల్లా క్రీడల అధికారి ఎల్.వి.రమణ అన్నారు. యోగాంధ్ర-2025లో భాగంగా గురువారం జిల్లాలోని అనకాపల్లి, అచ్యుతాపురం, ఎలమంచిలి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట, చోడవరం, సబ్బవరం, పరవాడ మండలాల్లో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో క్రీడాకారులు యోగాసనాలు వేశారు. 50 శిబిరాల్లో యోగా శిక్షణ ఇచ్చామని క్రీడల అధికారి రమణ తెలిపారు. యోగా చేయడం వల్ల ప్రశాంతత, ఏకాగ్రత, చురుకుదనం, మంచి ఆలోచనలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో కోచ్ రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ ఇండోర్‌స్టేడియంలో సామూహికంగా యోగాసనాలు

ఆరోగ్యం, ప్రశాంతతకు అవకాశం

యోగా చేయడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని, ప్రతి ఒక్కరూ విధిగా రోజు యోగా సాధన చేస్తే రోగాల బారిన పడకుండా ప్రశాంతంగా జీవిస్తారని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు అన్నారు. యోగాంధ్ర -2025లో భాగంగా రాజీవ్‌గాంధీ ఇండోర్‌స్టేడియంలో జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా సాధన కార్యక్రమం జరిగింది. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు దొరనాయుడు ఆసనాలు, శ్వాస ప్రక్రియలు చేసి చూపారు. అందరితో సాధన చేయించారు. జిల్లా ఆయుష్మాన్ అధికారిణి డాక్టర్ కె.లావణ్య మాట్లాడుతూ రోజూ యోగా చేస్తే అందరూ ఆరోగ్యంగా జీవిస్తారని, ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. వచ్చే నెల 21న విశాఖలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి అందరూ సమాయత్తం కావాలని, యోగా యాప్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు రామారావు, జిల్లా రిసోర్స్ కేంద్రం అధికారులు శ్రీధర్ సుబ్రహ్మణ్యం, మురళి, సహాయ సంచాలకులు రవీంద్ర, డివిజన్, మండలస్థాయి వ్యవసాయాధికారులు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మేలైన మార్గం యోగాసనం

సబ్బవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి మేలుచేసే మార్గం యోగాసనమే అని ఎంపీడీవో పి.పద్మజ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో యోగా రిసోర్స్ పర్సన్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ.. జూన్ 21న విశాఖలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనబోతున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. వివిధ శాఖలకు చెందిన 150 మంది రిసోర్స్ పర్సన్లకు శిక్షణ ఇస్తామన్నారు. వీరంతా నిర్దేశిత గ్రామాలకు వెళ్లి జూన్ 1 నుంచి యోగాసనాలపై శిక్షణ ఇచ్చి 21 నాటి యోగా డే వేడుకల్లో పాల్గొనేలా సంసిద్ధులను చేస్తారన్నారు. ప్రతి ఒక్కరి జీవన విధానంలో యోగాసనాలు భాగం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఆరోగ్యకర జీవనానికి యోగాసనాలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు పినపరెడ్డి సత్యనారాయణ, ఈశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిసోర్సు పర్సన్లతో వివిధ యోగా భంగిమలు వేయించి వాటి ప్రయోజనాలను వివరించారు.

దేమునిగుమ్మంలో శ్రీవారికి రూ.4.46 లక్షల ఆదాయం



హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ బృందం

అనకాపల్లి టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక దేమునిగుమ్మం వెంకటేశ్వరస్వామి ఆలయ హుండీలో భక్తులు వేసిన కానుకలను గురువారం లెక్కించారు. ఆలయ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 69 రోజులకు రూ.4,45,825 ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి మురళీకృష్ణ తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వసంతకుమార్ పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం గిరిబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ/సబ్బవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): వాడచీపురుపల్లి పంచాయతీ పోలిరెడ్డిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, దోసూరు, తిక్కవానిపాలెం పంచాయతీల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని కోరారు. అలాగే సబ్బవరం-02 సెక్షన్ పరిధిలోని 33 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం తెలిపారు. గుల్లేపల్లి, మలునాయుడుపాలెం, మొగలిపురం, బోదివలస, మర్రిపాలెం, ఎల్లుప్పి, అయ్యన్నపాలెం గ్రామాల వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఈఈ కోరారు.

రెస్టారెంట్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు



గాలిభీమవరంలోని ఓ రెస్టారెంట్‌లో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కె.సంతోశ్‌కుమార్

సబ్బవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం మండలంలోని గాలి భీమవరం పరిధిలో గల దావత్ రెస్టారెంట్‌లోని ఆహార పదార్థాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కె.సంతోశ్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ బి.చిన్నికృష్ణ ఆదేశాల మేరకు వివిధ రకాల ఆహార పదార్థాలను తనిఖీ చేశామని, పన్నీరు, తండూరి చికెన్‌పై అనుమానం వచ్చి శాంపిల్స్ సేకరించామన్నారు. వీటిని ల్యాబ్‌కు పంపామని, నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని చెప్పారు. సబ్బవరంలో ఇటీవల తనిఖీలు నిర్వహించి జయశ్రీ శ్యామ్, అంబిక స్వీట్స్ దుకాణాలపై కేసులు నమోదు చేశామన్నారు. ఇకపై తరచూ తనిఖీలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఆర్ఐ వీరయ్య, ఎస్ఐ దివ్య, వీఆర్వో వాత్సల్యరాయ్ పాల్గొన్నారు.

పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ



మహిళకు వస్త్రాలు అందజేస్తున్న రామాచార్యులు

కశింకోట, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ జ్యోతిష విద్వాంసులు రేజేటి రామాచార్యులు (రాంబాబు) జన్మదినోత్సవం సందర్భంగా గురువారం 300 మంది పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అంతేగాకుండా నిరుపేద కుటుంబాలకు బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కుటుంబ సభ్యులు, మండలంలో పురోహితులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వ్యవసాయ పద్ధతులపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు, చిత్రంలో ఇతర అధికారులు

కశింకోట, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు అన్ని వ్యవసాయ పద్ధతులపై పూర్తి అవగాహన ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో ఆయన మాట్లాడారు. ఖరీఫ్‌కు శాస్త్రవేత్తల ద్వారా అందించే వ్యవసాయ సలహా, సూచనలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బి.ప్రభాకరరావు మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఉద్యాన పంటలు, కూరగాయల సాగు విషయాలను తెలియజేశారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ గౌరీలు బెల్లం విలువ ఆధార ఉత్పత్తుల గురించి వివరించారు. మండల వ్యవసాయ శాఖాధికారిణి స్వప్న మాట్లాడుతూ పచ్చి రొట్ట ఎరువులు రైతుసేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ రజ్ని, కశింకోట, వెదురుపర్తి, తేగాడ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పవర్‌ప్లాంట్ నిర్మాణాన్ని నిలిపివేయాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం



సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

అనకాపల్లి టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవరాపల్లి మండలం చింతలపూడి, మారిక గ్రామాల మధ్యలో అదాని హైడ్రో పవర్‌ప్లాంట్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయకపోతే అడ్డుకుంటామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం హెచ్చరించారు. గురువారం దొడ్డి రామునాయుడు భవనంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న అధ్యక్షతన సీపీఎం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో లోకనాథం మాట్లాడుతూ అదానీ లూప్ పంప్ స్టోరేజి పవర్‌ప్లాంట్ నిర్మాణం కోసం విజయనగరం జిల్లా వేపాడ మండలం మారిక, దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీల పరిధిలో ఇచ్చిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం మారిక గ్రామానికి రెవెన్యూ సామాజిక నిపుణులు అదానీ మనుషులను తీసుకువెళ్లి ఆదివాసీ గిరిజనులను భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం అన్ని రకాల అనుమతులు పొందిన తరువాత అదానీ మనుషులను తీసుకు వెళ్లాలని, అదేమీ జరగకుండా వారిని తీసుకెళ్లడం సిగ్గుచేటన్నారు. తక్షణమే హైడ్రో పవర్‌ప్లాంట్‌ను నిలిపివేయకపోతే సీపీఎం అడ్డుకుంటుందన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

కార్మికురాలి మృతిపై సమగ్ర విచారణకు డిమాండ్

అనకాపల్లి టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరం మండలం గుడివాడలో గల సాయి మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ రెండో యూనిట్‌లో కార్మికురాలి మృతిపై సమగ్ర విచారణ జరపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ రెండో యూనిట్‌లో ఒడిశా కార్మికురాలి మృతి అనుమానాస్పదంగా ఉందన్నారు. సమగ్ర విచారణ జరిపి కార్మికురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు వీవీ శ్రీనివాసరావు, ఎం.సత్యనారాయణ, ఎం.రాజేష్, జి.రమణ, బి.రాము పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన సంజీవరావు, లక్ష్మి

లంకెలపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని గ్యాస్ సిలెండర్ల లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ద్విచక్ర వాహనం లారీ కిందకు వెళ్లడంతో నుజ్జునుజ్జయ్యింది. జాతీయ రహదారి లంకెలపాలెం పెట్రోల్ బంకు సమీపంలో గురువారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. పరవాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫార్మాసిటీ పునరావాస కాలనీకి చెందిన ఏదూరి సంజీవరావు, లక్ష్మీలు ఫార్మాసిటీలోని పరిశ్రమలో పనిచేస్తున్నారు. రోజూ మాదిరిగా ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. స్థానిక పెట్రోల్ బంకు వద్ద రహదారి దాటుతుండగా గ్యాస్ సిలెండర్ల లారీ వెనుక వచ్చి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సంజీవరావు, లక్ష్మీలు పక్కకు పడిపోవడంతో గాయాలతో బయట పడ్డారు. ద్విచక్ర వాహనం లారీ కిందకు వెళ్లడంతో నుజ్జునుజ్జయ్యింది. ఇరువురు పెను ప్రమాదం నుంచి బయట పడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. గాయపడిన ఇరువురిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పరవాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధులకు సచివాలయ సిబ్బంది డుమ్మా

» గడుతూరులో గిరిజనుల ఇక్కట్లు



గడుతూరు సచివాలయంలో రేషన్‌కార్డులు మార్పులు కోసం వేచిచూస్తున్న చిన్నారులు

జి.మాడుగుల, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గడుతూరు పంచాయతీ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ విధులకు ధుమ్మకొట్టడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ముడు రోజులుగా రేషన్‌కార్డులు మార్పులు, చేర్పుల కోసం సచివాలయానికి వెళ్తున్నా అక్కడ సిబ్బంది ఉండకపోవడంతో నిరాశతో వెనుదిరగాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు.ప్రధానమైన రేషన్‌కార్డుల సేవలకు సిబ్బంది అందుబాటులోలేక పంచాయతీ ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు వద్ద విలేకరులు సం ప్రదించగా, గడుతూరు సచివాలయ సిబ్బంది విధులకు గైర్హాజరవుతున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. ప్రస్తుతం అక్కడి సిబ్బంది ఎవరూ సెలవులో లేనట్టు చెప్పారు. విచారణ చేపడతామన్నారు.

ఆక్రమణలు తొలగించాలి



దుకాణాదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నర్సమ్మ

ముంచంగిపుట్టు, మే 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రోడ్డుకు ఇరువైపులా ఆ క్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించాలని 180 మంది వ్యాపారులకు తహసీల్దార్ నర్సమ్మ ఆదేశించారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికే వ్యాపారులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు.. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా వ్యాపారులు సహకరించాలని, రోడ్డు ఇరువైపులా తొలగింపు చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యాపారులు స్వచ్ఛందంగా షాపులు తొలగించకపోతే.. జేసీబీ ద్వారా తొలగించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

హెల్మెట్‌తో ప్రమాదాల నివారణ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ పాపినాయుడు

డుంబ్రిగుడ, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని స్థానిక ఎస్ఐ పాపినాయుడు సూచించారు. స్థానిక జా తీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రముఖ పర్యాటక కేంద్ర చాపరాయి జలవిహారీలో తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనదారులతో సమావేశమయ్యారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలన్నారు. వాహన రికార్డులు ఉండాలని, మైనర్లుకు ద్విచక్ర వాహనాలిస్తే తల్లి దండ్రులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

'సీహెచ్‌డబ్ల్యూల వేతనాలు చెల్లించాలి'

పాడేరురూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత ప్రజల ఆరోగ్య రక్షణకు అహర్నిశలు కృషి చేస్తున్న సామాజిక ఆరోగ్య కార్యకర్త (సీహెచ్‌డబ్ల్యూ)లకు నాలుగు నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు డిమాండ్ చేశారు. పాడేరు ఏజెన్సీలో 725 మంది సీహెచ్‌డబ్ల్యూలు పనిచేస్తున్నారని, వారికి ఐటీడీఏ నెలకు రూ. 4 వేలు మాత్రమే చెల్లిస్తోందన్నారు. చాలీచాలని వేతనాలు అందించే అధికారులు వాటిని కూడా సక్రమంగా సకాలంలో అందించకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే వేతనాలు చెల్లించకుంటే ఐటీడీఏ వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

పాడేరు మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ నెలతో ముగుస్తున్న నేపథ్యంలో జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాల పరిమితి మరో మూడు నెలలు జూన్ 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు పొడిగింపు ఉత్తర్వులను సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల ఆదేశాలు జారీ చేశారని స్థానిక డీపీఆర్‌వో పి.గోవింద రాజులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలల పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా పాత్రికేయులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మేడపై నుంచి పడి ఇద్దరి యువకులకు గాయాలు

చింతపల్లి, మే 29 (ఆంధజ్యోతి): మండలంలోని డైరీనగర్ గ్రామంలో పిట్టగోడ కూలి మేడపై నుంచి పడిపోయిన ఇద్దరు యువకులు గాయపడ్డారు. గురువారం మధ్యాహ్నం డెయిరీ నగర్ గ్రామంలోని ఓ గృహంపైన గెమ్మెలి బాలేరు, కాంతరాజులు పిట్టగోడ వద్ద డీటీహెచ్ డిష్ ఏర్పాటు చేస్తున్నారు. ఈక్రమంలో ఒక్కసారిగా పిట్టగోడ కూలిపోవడంతో మేడ పైనుంచి కిందకు పడిపోయారు. దీంతో ఇద్దరు యువకులు గాయపడడంతో స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. యువకుల ఆరోగ్యం నిలకడగావుందని వైద్యులు తెలిపారు.

పారిశుధ్యం ఇంత అధ్వానమా..?

» గూడెంకొత్తవీధిలో చెత్త కుప్పలు

» దుర్వాసతో జనాలు అవస్థలు.. అధికారుల్లో చలనం శూన్యం

» నిరుపయోగంగా సంపద కేంద్రం

గూడెంకొత్తవీధి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రధాన రహదారులతోపాటు వీధుల్లో దుర్గంధం నెలకొనడంతో స్థానికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మండల పరిషత్ అధికారులు, పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంతోనే వీధులు చెత్తతో పేరుకుపోతున్నాయి. చెత్తను ఏరోజుకారోజు తొలగించాల్సి ఉంది. కానీ, అలా చేయడంలేదు. అలాగే, ఈ చెత్తను తీసుకువెళ్లి సేంద్రియ ఎరువుల తయారీ చేయాల్సిన సంపద కేంద్రాన్ని నిరుపయోగంగా వదిలేశారు. రాష్ట్ర ప్రభుత్వం చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రాల వినియోగంలోకి తీసుకురావాలని, ప్రతి గృహం నుంచి చెత్తను పంచాయతీ కార్మికులు సేకరించి సంపద కేంద్రానికి తరలించి వర్మీ కంపోస్టు తయారు చేయడంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేయాలని



నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రం



గూడెం కొత్తవీధిలో పేరుకుపోయిన చెత్త

కచ్చితమైన ఉత్తర్వులు జారీచేసింది. అలాగే, స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రకు కృషి చేస్తోంది. మండలంలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. మండల పరిషత్ అధికారులు సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావడంలో పూర్తిగా విఫలమైనట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలోనున్న చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రం పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. ఇక వీధుల్లో చెత్తను తొలగించకపోవడంతో ఎక్కడికక్కడ కుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా కోళ్లు, మాంసం దుకాణాల నిర్వాహకులు రహదారి పక్కనే వ్యర్థాలను పడేస్తున్నారు. స్థానికులు పలు మార్లు మండల పరిషత్ అధికారులకు ఫిర్యాదు చేసినా, కనీస చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పారిశుధ్య సమస్యను పరిష్కరించకపోతే ప్రజలు వ్యాధులబారిన పడే ప్రమాదం ఉంది. ఇకనైనా మండల కేంద్రంలో పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అనాథ, నిరాశ్రయ బాలలకు ఆధార్ కార్డులు

విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు చిన్నంశెట్టి రాజు



చిన్నంశెట్టి రాజు

పాడేరు, మే 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలో ఉన్న అన్ని మండలాలకు చెందిన అనాథ, నిరాశ్రయ బాలలను సర్వే ద్వారా గుర్తింపు, అనంతరం ఆధార్ కార్డులు మంజూరు చేయనున్నట్టు విశాఖపట్నం జిల్లా న్యాయసేవా ప్రాధికారిక సంస్థ అధ్యక్షులు జస్టిస్ చిన్నంశెట్టి రాజు, కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి జూన్ 25వ తేదీ వరకు అన్ని గ్రామాల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, విద్యా శాఖ, సచివాలయం, పోలీస్, రెవెన్యూ సిబ్బంది, ఎన్‌జీవోల ద్వారా అనాథ బాలలను గుర్తించి ఆయా మండల తహసీల్దార్ల పర్యవేక్షణలో ఆధార్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. అలాగే, అనాథ, నిరాశ్రయ బాలలకు అర్హత మేరకు కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలను చేరువ చేస్తామని వివరించారు.

కొయ్యూరులో 31.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

పాడేరు, మే 29 (ఆంధ్రజ్యోతి): మన్యంలో వర్షాల ప్రభావం ఉన్నప్పటికీ గరిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. ఏజెన్సీలో ప్రస్తుతం వర్షాలు పడుతున్నా ఎండ ప్రభావం తగ్గడం లేదు. గురువారం కొయ్యూరులో 31.6 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, అనంతగిరిలో 27.8, పాడేరులో 26.6, అరుకులోయలో 26.3, చింతపల్లి, జీకేవీధి, హుకుంపేట మండలాల్లో 26.0, డుంబ్రిగుడలో 25.4, జి.మాడుగులలో 24.8, పెదబయలులో 24.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి



ఉప తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేస్తున్న పెసా కమిటీ ప్రతినిధులు

గూడెంకొత్తవీధి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని పెసా కమిటీ మండలాధ్యక్షుడు కొర్ర బలరామ్ కోరారు. గురువారం కమిటీ సభ్యులు ఉప తహసీల్దార్ దుమంతి సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా బలరామ్ మాట్లాడుతూ ఏప్రిల్ 24న ఆక్రమణకు గురైన భూముల వివరాలతో రెవెన్యూ అధికారులు వినతి పత్రం అందజేసినట్టు చెప్పారు. నేటి వరకు కనీసం చర్యలు తీసుకోవడంలేదని, దీంతో మరోసారి వినతి పత్రం అందజేశామన్నారు. ఇకనైనా సర్వే చేపట్టి అక్రమ కట్టడాలను తొలగించాలన్నారు. ఈకార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు గొర్లె వీరవెంకట్, ప్రధాన కార్యదర్శి మాదిరి చంటిబాబు పాల్గొన్నారు.

జ్వరంతో పదేళ్ల బాలుడి మృత్యువాత

» రహదారి సౌకర్యం, సెల్ నెట్ వర్క్‌లేక అందని వైద్య సేవలు

» జీకే వీధి మండలం గొల్లపల్లిలో విషాదం



మృతి చెందిన చిన్నారి చిన్నయ్యపడాల్

సీలేరు, మే 29 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం అమ్మవారి ధారకొండ పంచాయతీ గొల్లపల్లి గ్రామానికి చెందిన బోనంగి చిన్నయ్యపడాల్ (10) బాలుడు గురువారం సాయంత్రం జ్వరంతో మృతి చెందాడు. మృతుని తండ్రి చిన్నయ్యపడాల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత రెండు రోజులుగా తన కుమారుడు చిన్నయ్యపడాల్ జ్వరంతో బాధపడుతున్నాడని, ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి అంబులెన్సు కోసం ఫోన్ చేద్దామంటే తమ గ్రామంలో సిగ్నల్ సమాచారం ఇవ్వలేక పోయామన్నారు. ద్విచక్ర వాహనంపై ఆసుపత్రికి తరలించడానికి భారీ వర్షంతోపాటు రహదారి సౌకర్యం కూడా బాగోలేదన్నారు.మార్గం మధ్యలో వాగుపై వంతెన లేదన్నారు. ప్రస్తుతం వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తమ కుమారుడిని ఆసుపత్రికి తరలించలేకపోయామని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో తమ కుమారుడిని కోల్పోవాల్సి వచ్చిందని రోదిస్తున్నారు. తమ గ్రామానికిని సెల్‌నెట్ వర్క్ వారంలో రెండు మూడు రోజులు మాత్రమే పని చేస్తోందని, అలాగే రహదారి లేక అత్యవసర సమయాల్లో వైద్యం అందక పలువురు మృతి చెందుతున్నట్టు ఆ గ్రామ గిరిజనులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారి, వంతెన, సెల్ నెట్ వర్క్ సౌకర్యాలు కల్పించాలని గొల్లపల్లితోపాటు పరిసరాల్లోని పెబ్బంపల్లి, తడకపల్లి గ్రామాల గిరిజనులుడిమాండ్ చేస్తున్నారు.

'ఆదివాసీ నిరుద్యోగులకు ప్రత్యేక డీఎస్సీ తీయాలి'



కళ్లకునల్లరిబ్బన్‌లతో నిరసన తెలుపుతున్న స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు

పాడేరురూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ-2025 నుంచి ఆదివాసీ పోస్టులు మినహాయించి 5వ షెడ్యూల్ ప్రాంతంలో స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా గురువారం పాడేరు పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ జిల్లా చైర్మన్ కుడుముల కాంతారావు, జిల్లా కన్వీనర్ ఎస్.ధర్మన్నపడాల్, కో-కన్వీనర్ కూడా రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎన్ని సార్లు విన్నవించుకున్నా మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ పోస్టులు మినహాయించే ఆలోచన చేయకపోవడం దారుణమన్నారు. కడపలో జరుగుతున్న మహానాడులో కనీసం ఈ విషయంపై చర్చించకపోవడం నిరుద్యోగుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తుందన్నారు. నిరుద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ ప్రతినిధులు కె.కోటిజయప్రసాద్, జి.భాను, వి.నాగేశ్వరరావు, కె.కొత్తయ్య, ఎం.చిరంజీవి, డీపీ.శంకర్, జె.రాజుబాబు పాల్గొన్నారు.

పాడేరులో నేలకొరిగిన భారీ వృక్షం.. ట్రాఫిక్‌కు అంతరాయం



సినిమా హాలు సెంటర్‌లో ఆటోపై పడిన భారీ వృక్షం



ఆర్‌టీసీ కాంప్లెక్స్ ప్రధాన రహదారిలో నిలిచిన ట్రాఫిక్

పాడేరురూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): పాడేరు పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో సినిమాహాలు సెంటర్ సమీపంలో గురువారం ఉదయం 9 గంటల సమయంలో భారీ వృక్షం కూలిపోయింది. అక్కడే నిలిపి ఉన్న ఆటోపై చెట్టు పడటంతో ఆటో నుజ్జునుజ్జయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులకు ఒరిగి ఉన్న ఈ వృక్షం గురువారం ఉదయం ఒక్కసారిగా నేలకొరిగింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ఈ ప్రమాదం ఉదయం 10 తర్వాత జరిగి ఉంటే ప్రమాద తీవ్రత అధికంగా ఉండేదని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. వృక్షం నేలకొరిగి ట్రాఫిక్‌కు నిలిచిపోయిన విషయాన్ని తెలుసుకున్న ఆర్‌అండ్‌బీ ఈఈ పి.బాలసుందరరావు, డీఈఈ రామన్, వారి సిబ్బంది. తహసీల్దార్ వంజంగి త్రినాథరావు నాయుడు, ఆర్ఐ బజ్జంగి నల్లన్న, వీఆర్‌వోలు రామునాయుడు, రవికుమార్, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి యుద్ద ప్రాతిపదిన చెట్టును తొలగించారు. అదే మార్గంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల గేటు ఎదుట ఎండిపోయిన భారీ వృక్షాన్ని తొలించారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.

జి.మాడుగులలో భారీ వర్షం

జి.మాడుగుల : మండలంలోని బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి నుంచి కురిసిన కుంభవృష్టికి వాగులు వంకల నీటి ప్రవాహాలు పెరిగి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మద్దిగరువు ప్రాంతంలో రాసవీధి కలర్టు పైకి నీరు ప్రవహించింది. బొయితిలి పం చాయతీ దిగారాపల్లి పంటపొలాలు నీట మునిగాయి.. మండల కేంద్రంలో ప్రధాన రహదారి చిత్తడిగా మారింది. అల్పపీడన ప్రభావంతో గురువారం ఉదయం వరకు భారీ వర్షం కురిసిన మధ్యహ్నం తగ్గుముఖం పట్టడంతో జనాలు ఊపిరిపీల్చుకున్నారు.



మద్దిగరువు ప్రాంతం సూరిమెట్ట పంటపొలాల్లో వరద నీరు

మహానాడులో సందడి

కడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు సభ మూడవ రోజైన గురువారం కార్యక్రమంలో మంత్రు లు గుమ్మడి సంధ్యారాణి, వంగలపూడి అనిత, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు.





మహానాడులో మంత్రులు సంధ్యారాణి, వంగలపూడి అనిత, పాల్గొన్న గిడ్డి ఈశ్వరి

డివిజన్ స్థాయి రిసోర్స్ పర్సన్లకు యోగా శిక్షణ



యోగా శిక్షణలో రిసోర్స్ పర్సన్లు

పాడేరురూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): పాడేరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో మండల రిసోర్స్ పర్సన్లకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం యోగా శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో పి.బ్రహ్మాజీరావు పర్యవేక్షణలో అందించినట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీ వండలం కొండబాబు తెలిపారు. పాఠశాల రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు పాడేరు డివిజన్ పరిధిలోని రిసోర్స్ పర్సన్లకు పాడేరులో, రంపచోడవరం డివిజన్‌లోని వారికి రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ యోగా శిక్షణను అందించినట్టు చెప్పారు. మండలం నుంచి ఒక ఆడ, ఒక మగ పీఈటీ, పీడీలు చొప్పున జిల్లాలోని 22 మండలాకు చెందిన 44 మంది ఈ శిక్షణ పొందారన్నారు. పాడేరు డివిజనల్ రిసోర్స్ పర్సన్లు బి.సత్యవతి, యూ.ఈశ్వరరావు, రంపచోడవరం డివిజనల్ రిసోర్స్ పర్సన్లు కె.తిరుపతిరావు, జి.దేవి ఆద్వర్యంలో జరిగాయన్నారు. శిక్షణ పొందిన ఎంఆర్‌పీలు ఆయా మండలాల్లోని అన్ని పాఠశాలల పీఈటీ, పీడీలకు జూన్ 4వ తేదీ బుధవారం శిక్షణ అందిస్తారని ఆయన తెలిపారు.

పాడేరులో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు: సీఐ



పాడేరు-అరకు ప్రధాన రహదారిలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పాడేరురూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగం గా విస్తృతంగా వాహన తనిఖీలను చేపడుతున్నట్టు సీఐ డి. దీనబందు తెలిపారు. గురువారం పాడేరు - అరకు ప్రధా న రహదారిలో తలారిసింగి జంక్షన్ వద్ద ఈ తనిఖీలను చేపట్టామన్నారు. హెల్మెట్ ధరించని, వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ లేని, రాంగ్ పార్కింగ్ చేసిన వారిపై 34 కేసులు నమోదు చేశామన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వ వద్దని తల్లిదండులకు సూచించారు. కాదని ఇచ్చి పోలీసుల తనిఖీల్లో పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు వాహన యజమానిపై కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ఎల్.సురేశ్, ఏఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్ డీపోల ద్వారా రేషన్ పంపిణీకి ఏర్పాట్లు



గూడెంకొత్తవీధిలోని డీఆర్ డిపోను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌకధరల దుకాణాలు (డీఆర్ డిపోలు) ద్వారా రేషన్ బియ్యం పంపిణీకి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ అన్నారు. గురువారం తహసీల్దార్ జీసీసీ గోదాం, డీఆర్ డిపోలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జూన్ ఒకటి నుంచి డీఆర్ డిపోల ద్వారా రేషన్ బియ్యం, ఇతర సరకులు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. ప్రజలు రేషన్ దుకాణల వద్దకు వచ్చి బియ్యం తీసుకోవాలన్నారు. 65 ఏళ్లపైబడిన వృద్ధులకు వారి గృహాలకు రేషన్ పంపిణీ చేస్తామన్నారు. బియ్యం గోదాం నుంచి డిపోలకు తరలించడం జరుగుతుందన్నారు. సేల్స్‌మన్, ఉమన్ నెలలో 17 రోజులు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో దుకాణాలు తెరచి ఉంచాలన్నారు. కార్యక్రమంలో లీగల్ ఇన్‌స్పెక్టర్ కె. రత్నరాజు పాల్గొన్నారు.

యోగా దినోత్సవం విజయవంతానికి ప్రత్యేక చర్యలు



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

చింతపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ యోగా దినోత్సవం విజయవంతానికి గ్రామ స్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ యోగాపై ప్రస్తుతం మాస్టర్ ట్రైనీలు గ్రామ స్థాయి ట్రైనీలకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ట్రైనర్లు జూన్ ఐదు నుంచి ఏడు వరకు స్వయం సహాయ సంఘాల సభ్యులు, 9 నుంచి 11వ తేదీ వరకు రైతులు, వివిధ వృత్తులవారికి, 12 నుంచి 14 వరకు యువత, విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ పొందిన ప్రజలంతా యోగా దినోత్సవం రోజు ప్రదర్శన ఇస్తారన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు



వేరుశెనగ పంటను గోప్పు తవ్వుతున్న గిరి రైతులు

డుంబ్రిగుడ, మే 29 (ఆంధ్రజ్యోతి): మన్యంలో ఉమ్మడి వ్యవసాయ సాగుకు నిలయంగా ఉంటోంది. తరతరాలుగా కుటుంబాలు సమష్టి వ్యవసాయం చేస్తున్నారు. ప్రస్తుతం మన్యంలో కురుస్తున్న వర్షాలతో గిరిజన కుటుంబాలు ఖరీఫ్ వ్యవసాయ పనులకు సిద్ధమయ్యారు. పొలాల్లో దుక్కులు చేస్తూ బిజీగా గడుపుతున్నారు. పిల్లాపాపలతో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వేరు శెనగ పంట గొప్పు తవ్వకాలు చేపడుతున్నారు. అయితే, వేసవిలో వేసిన రబీ వరి పంట ప్రస్తుతం కోతకు వచ్చింది. ఈ సమయంలో పడుతున్న వర్షాలు ఈ పంటకు నష్టవాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒంబి, సిందిగుడ రోడ్డుకు మోక్షమెన్నడో?



అసంపూర్తిగా గ్రావెల్‌తో ఉన్న రహదారి

డుంబ్రిగుడ, మే 29 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో మన్యంలో మారుమూల గిరిజన గ్రామాలు రహదారి సౌకర్యానికి దూరంగా ఉన్నాయి. చాలా గ్రామాలకు వెళ్లే రహదారులను అసంపూర్తిగా వదిలేసింది. దీంతో గిరిజన గ్రామాలు గత ఐదేళ్లుగా అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. మండలంలోని కండ్రుం పంచాయతీ ఒంబి, సిందిగుడ, దొరగుడ గ్రామాలకు వెళ్లే రోడ్డే ఇందుకు నిదర్శనంగా నిలుస్తుంది. గత కొన్నేళ్లుగా ఈ రోడ్డు నిర్మాణం పూర్తికాక గిరిజనులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గొలుగొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): గొలుగొండలో గురువారం యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వచ్చే నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని సచివాలయ, వివిధ శాఖల ఉద్యోగులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మేరీరోజీ తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి వెంకటరమణ, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం కరుణానిధి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి డాక్టర్ ప్రసాద్

మాకవరపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని డాక్టర్ ప్రసాద్ అన్నారు. గురువారం జంగాలపల్లి, పీపీ అగ్రహారం గ్రామాల్లో బీసీటీ-కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తూ నూతన సాంకేతిక పద్ధతులను అనుసరించి రైతులు మరింతగా అభివృద్ధి చెందాలన్నారు. ప్రకృతి వ్యవసాయం-పీఎం-కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలపై రైతులకు తెలియజేశారు. అలాగే వరిలో నూతన పరికరాల వినియోగం, వివిధ పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి చిరంజీవి, వ్యవసాయ సిబ్బంది, టీడీపీ నాయకుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న సంజీవరావు

మాడుగుల రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కోడూరులో ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి స్థానిక సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, ప్రభావతి దంపతులు రూ. 50వేలు విరాళంగా గురువారం నిర్వాహకులకు అందించారు. తన తల్లిదండ్రులు గొల్లవిల్లి రామారావు వరహాలమ్మ జ్ఞాపకార్థం విరాళం అందించినట్లు సంజీవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాము, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

వికాస తరంగిణి కార్యక్రమాలకు తోడ్పాటు అందించండి

- ప్రభుత్వం సహకరిస్తే ఏపీలో మహిళలకు వైద్య సేవలు
- స్పీకర్‌ను కోరిన త్రిదండి చిన్నజీయర్ స్వామి

నర్సీపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): వికాస తరంగిణి ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు ప్రభుత్వం తరఫున తోడ్పాటు అందించాలని శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి కోరారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నివాసానికి గురువారం ఆయన వెళ్లారు. స్పీకర్ కుటుంబ సభ్యులు చినజీయర్ స్వామిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిన్నజీయర్ స్వామి మాట్లాడుతూ వికాస తరంగిణి ఆధ్వర్యంలో మహిళలకు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా చికిత్స చేయిస్తున్నామని తెలిపారు. ప్రతీ గ్రామంలో క్యాన్సర్‌ని గుర్తించడానికి 20 మంది మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన మహిళలు ముందుగా క్యాన్సర్ వ్యాధిని గుర్తించగలిగితే సకాలంలో చికిత్స అందించేందుకు వీలు పడుతుందని అన్నారు. ఇప్పటికే తెలంగాణలో వైద్య సేవలు అందిస్తున్నామని, ఏపీ ప్రభుత్వం సహకారం అందిస్తే సేవలు మరింత విస్తరించడానికి ప్రణాళిక చేస్తున్నామని చిన్నజీయర్ స్వామి అన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ప్రభుత్వంతో మాట్లాడటమే కాకుండా అసెంబ్లీలో చర్చకు తీసుకు వస్తామని హామీ ఇచ్చారు. శుక్రవారం కృష్ణాదేవిపేటలో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్, వికాస తరంగిణి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివాసీల సామూహిక వివాహ మహోత్సవానికి వెళ్తూ మార్గమధ్యలో స్పీకర్ ఇంటి వద్ద ఆయన ఆగారు. అంతకుముందు చిన్నజీయర్ స్వామి భీమిలిలో అంధుల పాఠశాల విస్తరణ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

కేడీపేటలో ఘన స్వాగతం..

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటకు గురువారం రాత్రి 10 గంటల సమయంలో చిన్నజీయర్ స్వామి చేరుకున్నారు. స్థానిక చెక్కా



చిన్నజీయర్ స్వామిని సాదరంగా ఆహ్వానిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

వేంకట పద్మావతి కల్యాణమండపానికి విచ్చేసిన ఆయనను నేలపై అరటి ఆకులు వేసి మహిళలు ఘనస్వాగతం పలికారు. అనంతరం సామూహిక వివాహాలు జరిగే తంగేటి శ్రీనివాస కల్యాణ మండపంలో పలువురు ఆదివాసీ జంటలతో కాసేపు ముచ్చటించారు. శుక్రవారం జరిగే సామూహిక వివాహాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి కేంద్ర కమిటీ, దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.



కృష్ణాదేవిపేటలో అరటి ఆకులపైనుంచి చిన్నజీయర్ స్వామిని తీసుకువెళ్తున్న దృశ్యం

ఎన్టీఆర్ మినీ స్టేడియానికి మంచి రోజులు

- అభివృద్ధికి అంచనాలు తయారు చేయాలని స్పీకర్ ఆదేశం



నర్సీపట్నంలో ఎన్టీఆర్ మినీస్టేడియం

నర్సీపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ఎన్టీఆర్ మినీ స్టేడియానికి మంచి రోజులు వచ్చాయి. ఏళ్ల తరబడి స్టేడియంలో ఉన్న సమస్యల పరిష్కారానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక దృష్టి పెట్టారు. బుధవారం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా స్టేడియంలోకి వచ్చారు. ఈ సందర్భంగా ఇక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షం పడినప్పుడు మైదానంలో నీరు నిల్వలేకుండా మురుగు కాలువలు, ప్రహరీ, నడకమార్గం నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని పంచాయతీరాజ్ డీఈని ఆదేశించారు. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలన్నారు. స్టేడియంలో డ్రైనేజీ కాలువలో మట్టి, రాళ్లు అడ్డుపడి వర్షం పడితే నీరు నిలిచిపోయి బురదగా తయారవుతుంది.దీనివలన ఉదయం, సాయంత్రం స్టేడియానికి వచ్చే సందర్శకులు, క్రీడాకారులు, ఆడుకోవడానికి వస్తున్న పిల్లలు, వాకర్స్ వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. మందుబాబులు మద్యం ఖాళీ సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు, తినుబండారాల వ్యర్థాలు పడేసి పోతున్నారు. స్టేడియం అభివృద్ధికి స్పీకర్ ప్రత్యేక దృష్టి పెట్టడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చౌక దుకాణాల కాటాలు, ఈ పోస్ యంత్రాల తనిఖీ

నర్సీపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపులకు సంబంధించి ఎలక్ట్రానిక్ కాటాలు, ఈ పోస్ యంత్రాలను అధికారులు తనిఖీ చేశారు. జూన్ 1 నుంచి చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ జరగనున్న విషయం తెలిసిందే. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ జి.రామచంద్రయ్య ఎలక్ట్రానిక్ కాటాలు, ఈ పోస్ యంత్రాలను తనిఖీ చేశారు. నర్సీపట్నం, మాకవరపాలెం, కోటవురట్ల మండలాలకు సంబంధించి 80 కాటాల తనిఖీని పూర్తి చేశారు.



నర్సీపట్నంలో ఈ పోస్ యంత్రాలను తనిఖీ చేస్తున్న అధికారులు

తూకంలో తేడాలు లేకుండా చూడండి

గొలుగొండ, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతినెలా చౌక దుకాణాల ద్వారా అందజేసే రేషన్ సరకులను తూకాల్లో తేడా లేకుండా వచ్చే నెల 1 నుంచి కార్డుదారులకు పంపిణీ చేయాలని గొలుగొండ తహసీల్దార్ శ్రీనివాసరావు డీలర్లను ఆదేశించారు. తొలిరోజు ప్రజాప్రతినిధులను ఆహ్వానించి, వారి ద్వారా సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. తన కార్యాలయంలో గురువారం డీలర్లతో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ పలు సూచనలు చేశారు. సరుకుల పంపిణీలో కార్డుదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్లాన్ అనుమతులు మరింత సులభతరం



సమావేశంలో మాట్లాడుతున్న టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ పెనగంటి నాయుడు, చిత్రంలో కమిషనర్ సురేంద్ర తదితరులు

నర్సీపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలకు ప్లాన్ మంజూరు మరింత సులభతరం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పట్టణ ప్రణాళిక విభాగం రీజనల్ డైరెక్టర్ పెనగంటి నాయుడు తెలిపారు. గురువారం ఆయన నర్సీపట్నం మునిసిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు, లైసెన్స్‌డు టెక్నికల్ పర్సన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పట్టణ ప్రణాళిక విభాగంలో కొన్ని నిబంధనలు సడలించి ప్లాన్‌లు త్వరితగతిన ఇవ్వడానికి చర్యలు తీసుకుందని చెప్పారు. అందుకు అనుగుణంగా సిబ్బంది పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. సెట్ బ్యాక్స్ తగ్గించని, తక్కువ విస్తీర్ణంలో బహుళ అంతస్తులు నిర్మించుకునే అవకాశం కల్పించారని తెలిపారు. ఊడా అప్రూవల్ వరకు వెళ్లే అవసరం లేకుండా పురపాలక సంఘం కమిషనర్ పరిధిలోనే అనుమతులు మంజూరు చేస్తారని తెలిపారు. లే-అవుట్లకు కూడా మునిసిపాలిటీలోనే అనుమతులు ఇస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రహదారికి స్థలం విడిచి పెట్టి వెలుతురు, గాలి వచ్చే విధంగా ఇళ్లు నిర్మించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సురేంద్ర, టౌన్ ప్లానింగ్ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరిజన బాలలకు ఉపకరణాలు పంపిణీ



చుక్కపనుకు గ్రామంలో విద్యార్థులకు సామగ్రి అందిస్తున్న ఎస్ఐ తారకేశ్వరరావు

కృష్ణాదేవిపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట పరిసర గిరిజన ప్రాంతమైన చుక్కపనుకు గ్రామంలో కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తన సిబ్బందితో గురువారం పర్యటించారు. కమ్యూనిటీ పోలీస్‌సింగ్‌లో భాగంగా పీటీజీ గ్రామంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాల మేరకు చుక్కపనుకు గ్రామంలో చిన్నారులకు, విద్యార్థులకు పలకలు, పుస్తకాలు తదితర విద్యా ఉపకరణాలతో పాటు యువతకు వాలీబాల్ కిట్టు పంపిణీ చేశారు. ఎస్ఐ వై.తారకేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన పీటీజీ గ్రామాల్లో చిన్నారులు విద్యలో రాణించాలన్న ఉద్దేశంతో ఉన్నతాధికారుల సూచన మేరకు ఈ సేవా కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 108 ఆదివాసీ జంటలకు సామూహిక వివాహాలు



శ్రీనివాసా కల్యాణ మండపం వద్ద ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, మే 29(ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట తంగేటి శ్రీనివాసా కల్యాణ మండపం ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు 108 ఆదివాసీ జంటలకు సామూహిక వివాహాలు జరగనున్నాయి. చినజీయర్ స్వామి పర్యవేక్షణలో ఈ వివాహాలు జరగనున్నాయి. దీనికి సంబంధించి వికాశ తరంగిణి కేంద్ర కమిటీ, దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక తంగేటి శ్రీనివాస కల్యాణ మండలం ఆవరణలో ఏర్పాట్లు చేస్తున్నారు.

మూల్యాంకనంలో పొరపాటు.. చిన్నారికి గ్రహపాటు

- పదో తరగతి ఫలితాల్లో ఫెయిల్.. రీ వేల్యూయేషన్‌లో ఉత్తీర్ణత
- తెనుగుపూడి అంబేడ్కర్ గురుకులం విద్యార్థికి వింత అనుభవం

దేవరాపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెనుగుపూడి అంబేడ్కర్ బాలుర గురుకులం విద్యార్థి లింగాల ఆకర్ష్ పదో తరగతి పరీక్షల మార్కుల మూల్యాంకనంలో లోపం జరిగింది. దీంతో కొద్దిరోజుల కిందట ఎస్ఎస్‌సీ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో ఆ విద్యార్థి తప్పాడు. అనంతరం రీవేల్యూయేషన్‌కు వెళ్లడంతో తిరిగి పాసైనట్టు సెకండరీ ఎడ్యుకేషన్ అధికారులు ప్రకటించడంతో ఆ విద్యార్థి, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఆకర్ష్ సాంఘిక శాస్త్రం తప్పినట్లు ఇటీవల ఎస్ఎస్సీ బోర్డు విడుదల చేసిన చేసిన ఫలితాల్లో వచ్చింది. దీంతో స్పాట్ వేల్యూయేషన్‌కు వెళ్లారు. తొలుత మిగిలిన అన్ని సబ్జెక్టులు పాసై, సాంఘిక శాస్త్రం కేవలం 18 మార్కులు రావడంతో ఈ పేపరు మూల్యాంకనం అనుమానం వచ్చి ఎస్ఎస్సీ బోర్డుకు రూ. వెయ్యి చలానా కట్టి రీవేల్యూయేషన్ చేయించారు. ఈ రీ వేల్యూయేషన్‌లో సోషల్ 65 మార్కులు వచ్చినట్టు ఎస్ఎస్సీ బోర్డు నుంచి బుధవారం ఆకర్ష్ ఫోన్‌కి సమాచారం వచ్చింది. అతని జవాబు పత్రంలోని పేజీలను పంపించారు. ఎట్టకేలకు తన కుమారుడు ఉత్తీర్ణత సాధించడంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై 4న 'వెన్నుపోటు దినం'

- వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి ధర్మశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

చోడవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో వైఫల్యాలపై జూన్ 4న చోడవరంలో వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్టు వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి ధర్మశ్రీ తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో సూపర్‌సిక్స్ పేరుతో పథకాల ఆశ చూపించి అధికారంలోనికి వచ్చిన తర్వాత ప్రజలకు వెన్నుపోటు పొడిచినట్టు విమర్శించారు. ప్రభుత్వం ప్రజలను వంచించిన తీరుకు నిరసనగా నియోజకవర్గ కేంద్రాల్లో చేపడుతున్న ఈ వెన్నుపోటు దినం ఆందోళనలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గంలో కీలకమైన గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం గందరగోళంలో నెట్టేసిందన్నారు. బీఎన్ రోడ్డును ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమావేశం లో వైసీపీ నాయకులు ఏడువాక సత్యారావు, బొడ్డేడ సూర్యనారాయణ, సత్య, బైన ఈశ్వరరావు, వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేశ్ పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డును అభివృద్ధి చేయరా..?

రావికమతం, మే 29 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం - భీమునిపట్నం రోడ్డు అభివృద్ధిపై అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు ఇచ్చిన హామీని అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ, గత పదేళ్లుగా బీఎన్ రోడ్డు ధ్వంసమై వాహనాలు, ప్రయాణికులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ రోడ్డు అభివృద్ధికి అనుమతులు మంజూరు చేసినా, నిధులు మంజూరు చేయక కాంట్రాక్టర్ పనులు మధ్యలో ఆపేశారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రోడ్డునే ముందు అభివృద్ధి చేస్తామని ఎంపీ,ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలు నెరవేరలేదన్నారు. గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎస్.వలసయ్య, సీపీఎం నాయకులు పాంగి చంద్రయ్య, రైతు సంఘ నాయకులు ఎస్.రాజు పాల్గొన్నారు.

రాయితీపై పశువుల దాణా

చీడికాడ, మే 29 (ఆంధ్రజ్యోతి): పాడిరైతులకు 50శాతం సబ్సిడీపై ప్రభుత్వం పశుదాణా అందజేస్తున్నట్టు జి.కొత్తపల్లి సర్పంచ్ కొల్లి సూరి నాయుడు తెలిపారు. గురువారం రైతులకు పశు దాణా అందించారు. రైతులు కొల్లి నారాయణమూర్తి, దొగ్గ మంగునాయుడు, సిబ్బంది అర్జున్ పాల్గొన్నారు.



చిననందిపల్లిలో సిరిమాను ఊరేగింపులో గ్రామస్థులు



వీరవల్లి అగ్రహారంలో అమ్మవారికి సారె తీసుకువెళుతున్న భక్తులు

వైభవంగా చిననందిపల్లిలో మరిడిమాంబ పండగ

దేవరాపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిననందిపల్లి మరిడిమాంబ పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవంలో సమాచారం ఇచ్చి పుచ్చుకునేందుకు వీలుగా కమిటీ సభ్యులు వాకీ టాకీలు వాడారు. సిరిమాను ఊరేగింపు ఘనంగా జరిగింది. 16 సంవత్సరాలు తరువాత జరిగిన ఈపండగకు గ్రామస్థులు, బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మకు సారె సమర్పణ

మాడుగుల రూరల్: మండలంలోని వీరవల్లి అగ్రహారంలోని మోదకొండమ్మకు అమ్మవారి మాలధారణ చేసిన భక్తులతో పాటు గ్రామస్థులు గురువారం ఘనంగా భారీ సారె సమర్పించారు. గ్రామస్థులు పలురకాలు పిండి వంటలు, పండ్లు తదితర వాటితో ఊరేగిస్తూ ఆలయానికి తీసుకువెళ్లి నైవేద్యంగా సమర్పించారు.ఈ కార్యక్రమంలో గురుమాత పాలకుర్తి శ్రీనివాస్, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ఎరువులు ఆదా

అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏడీఆర్ ముకుందరావు



సమావేశంలో ముకుందరావు

చీడికాడ, మే 29(ఆంధ్రజ్యోతి): భూ సార పరీక్షలు తగు మోతాదులో ఎరువుల వినియోగానికి వీలవుతుందని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు అన్నారు. వీక్షిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలో ఖండివరం, శిరిజాం, కోనాం గ్రామాల్లో గురువారం రైతులతో సమావేశాలు జరిగాయి. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. భూసార పరీక్షల విశిష్టతను ఆయన వివరించారు. కొండెంపూడి కృషివిజ్ఞాన కేంద్రం సమన్వయకర్త జిల్లా నోడల్ ఆఫీసర్ ఎస్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ, రైతులు పురుగులు, తెగుళ్ల నివారణ చర్యలు వివరించారు. సేద్య విభాగం శాస్త్రవేత్త ఎ.సౌజన్య వరిలో నూతన రకాలైన ఎంటీయూ, 1224, 12622, బీపీటీ 2295, 2846, ఎంటీయూ 1318 రకాలను వివరించారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి మండలం నుంచి నామినేట్ అయిన ఎం.వెంకటేష్, కె.కిరణ్, ఎరువులు యాజమాన్యం పంటల అధిక దిగుబడికి చేపట్టాల్సిన పనులు వివరించారు. సెంటర్ మెరైన్ ఫిషరీష్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన డా.ఎం.ఇందిర, ఏవో ఎ.కృష్ణవేణి, ఉద్యావన అధికారిణి ఆర్.కిరణ్మయి, కృషి విజ్ఞాన కేంద్రం కొండెంపూడి శాస్త్రవేత్తలు ఎం.సత్తిబాబు, ఎ.సౌజన్య, ఎం.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన యోగా ట్రైనర్ల శిక్షణ

బుచ్చెయ్యపేట మే 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో యోగా ట్రైనర్లకు శిక్షణ గురువారం మూడవ రోజు కొనసాగింది. యోగా గురువు పైడిరాజు, మాస్టర్ ట్రైనర్ ఎన్. హేమసాయి, ఆయుష్ వైద్యాధికారి రామలక్ష్మి ఆధ్వర్యంలో సూక్ష్మ వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం సాధన చేయించారు. ఎంపీడీవో విజయలక్ష్మి,ఈవోపీఆర్డీ విజయలక్ష్మి,మండంలోని 22 పంచాయతీల సిబ్బంది ,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో 50 మందికి చొప్పన యోగా శిక్షణ అందించాలని ఎంపీడీవో ఈసందర్భంగా సూచించారు.

రేషన్ సరకులు సక్రమంగా పంపిణీ చేయాలి: తహసీల్దార్



బుచ్చయ్యపేటలో మాట్లాడుతున్న తహసీల్దార్

బుచ్చెయ్యపేట మే 29 (ఆంధ్ర జ్యోతి): మండల రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లతో తహసీల్దార్ ఎం. లక్ష్మి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు డీలర్లు ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం, సాయం త్రం రేషన్ సరకులు అమ్మకాలు చేయాలన్నారు. ప్రతి రేషన్ షాపు వద్ద సీసీ కెమెరాలు అమర్చాలని కోరారు.

రోలుగుంట: జూన్ 1 నుంచి చౌక ధరల దుకాణాల్లో రేషన్ సరకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ నాగమ్మ ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో మండంలోని 38 డిపోలకు చెందిన రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీటీ శంకరరావు, ఆర్ఐ రామమూర్తి పాల్గొన్నారు.

దేవరాపల్లి:తహసీల్దార్ పి.లక్ష్మీదేవి డీలర్లతో సమావేశం నిర్వహించారు. డిపోల వద్ద నిత్యావసరాల ధరల బోర్డులు పెట్టాలన్నారు. ప్రతి నెల 1నుంచి 17 వరకు తనిఖీలు నిర్వహిస్తారన్నారు.

దాసరయ్యపాలెం వద్ద కల్వర్టును పునర్నిర్మించాలి



కూలిన కల్వర్టు వద్ద నిరసన తెలుపుతున్న దాసరయ్యపాలెం గ్రామస్థులు

రావికమతం, మే 29 (ఆంధ్రజ్యోతి): భారీ వాహనాల రాకపోకలతో కూలిన కల్లర్టును తక్షణమే పునర్నిర్మించాలంటూ దాసరయ్యపాలెం గ్రామస్థులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. రావికమతం నుంచి దాసరయ్యపాలెం మీదుగా మరుపాక వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో దాసరయ్యపాలెం వద్ద కల్వర్టు ఉంది. భారీ వాహనాల రాకపోకలతో ఇటీవల సగానికి పైగా కూలిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారింది. ఈ కల్వర్టు కూలిన చోట్ల ఆర్అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయక, ప్రమాదాలకు గురవుతున్నారని వేపాడ సింహాచలంనాయుడు,సత్తిబాబు, కరణం తాతాలు, జనపరెడ్డి అప్పారావు, సాసుబిల్లి లక్ష్మణ, ఏళ్ల సత్తిబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం


చీడికాడ: మం డలంలో శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరపరా నిలుపు చేస్తున్నామని ఏఈ నమ్మి వెంకటరావు తెలిపారు. వివిధ మరమ్మతు పనుల నిమిత్తం తురువోలు ఫీడర్‌లో చీడికాడ, కొండవీధి, తురువోలు, తంగుడుపల్లి, అర్జునగిరి, పెదగోగాడ, జి.కొత్తపల్లి, వరహాపురం, ఎ.అగ్రహారం, చుక్కపల్లి, వింటిపాలెం, తునివలస, చినగోగాడ గ్రామాలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెద్దేరు, కోనాం జలాశయాలకు వరద తాకిడి

- 135.7 మీటర్లకి చేరిన 'పెద్దేరు' నీటిమట్టం

మాడుగుల రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దేరు జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరువగా ఉంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున కొండవాగుల నుంచి వర్షం నీరు జలాశయంలోకి వచ్చి చేరుతున్నది. దీంతో నీటిమట్టం పెరిగింది. జలాశయ గరిష్ఠనీటిమట్టం 137 మీటర్లు కాగా గురువారం సాయంత్రానికి 361 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 135.70 మీటర్లకి నీటిమట్టం చేరింది. దీంతో రాత్రి 9 దాటిన తర్వాత మూడో నంబరు గేటు తెరిచి 300 క్యూసెక్కుల నీటిని విడిచిపెడతామని, ఇన్‌ఫ్లో తగ్గితే శుక్రవారం వేకువజామున గేటు మూసేస్తామని జలాశయం ఏఈ సుధాకర్ రెడ్డి తెలిపారు. దిగువన పెద్దేరు పరిసర గ్రామాల వారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

కోనాం జలాశయం ...



పెద్దేరు జలాశయం

చీడికాడ:గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో కోనాం జలాశయానికి నీరు చేరుతుంది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లుకాగా, గురువారం ఉద యానికి 96.30 మీటర్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే తేదీ నాటికి 95.50 మీటర్లు నీటినిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 260 క్యూసెక్కులుకాగా ఔట్‌ఫ్లో 30క్యూసెక్కులు ఉందని ఏఈ సీహెచ్. జయరాం తెలిపారు.





సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు



మహా జాతర



కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్టుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం





జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

అనకాపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలల పాటు అంటే జూన్ 1 నుంచి ఆగస్టు 31 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లాలో మే 31 నాటికి అక్రిడిటేషన్లు పొంది ప్రస్తుతం పనిచేస్తున్న 229 మంది జర్నలిస్టుల కార్డుల గడువు పొడిగించనున్నారు. గడువు పొడిగింపు అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం మీడియా సంస్థల యాజమాన్యాల నుంచి సిఫారసు లేఖలను ఈ నెలాఖరులోగా జిల్లా కార్యాలయానికి అందజేయాలని జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

కాపు సంక్షేమానికి పెద్దపీట


మహానాడు ముగింపు సభలో మాట్లాడుతున్న కోట్ని బాలాజీ

▸▸ మహానాడు సభలో డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ

తుమ్మపాల, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాపు సంక్షేమానికి టీడీపీ పెద్దపీట వేస్తోందని డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ తెలిపారు. గురువారం కడపలో జరుగుతున్న మహానాడు వేదికపై కాపు సంక్షేమంపై ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కాపు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని 2014-2019లో కాపు కార్పొరేషన్‌కు సుమారు రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 47 వేల మంది కాపు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకుంటే ఏ ఒక్కరికి రూపాయి కూడా మంజూరు చేయకుండా కాపులను నట్టేట ముంచారని విమర్శించారు. కాపులపై మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కాపు కార్పొరేషన్‌కు రూ.15 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించిందన్నారు.

రెవెన్యూ బదిలీలకు రంగం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

తహశీల్దార్లలో ఇద్దరు ముగ్గురిని ఇప్పటివరకు రిలీవ్ చేయలేదు. వారి స్థానంలో విశాఖ, అనకాపల్లి నుంచి ఎవరూ ఏజెన్సీకి వెళ్లకపోవడంతో అక్కడి కలెక్టర్ పాడేరు డివిజన్‌లో పని చేసే వారిని రిలీవ్ చేయలేదు.

జిల్లాల విభజన సమయంలో జూనియర్లను అల్లూరి జిల్లాకు పంపారు. ఆ తరువాత పదోన్నతులు రావడంతో కొందరు జూనియర్లు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సీనియర్ అసిస్టెంట్ల నుంచి డీటీలుగా, డీటీల నుంచి తహశీల్దార్లుగా పదోన్నతులు పొందారు. విశాఖలో పనిచేసేవారు ఎక్కువ మంది ఇక్కడ నుంచి అల్లూరి జిల్లాకు వెళ్లడానికి ఇష్టపడడం లేదనే వాదన వినిపిస్తోంది. దీంతో చాలామంది ఉద్యోగులు ఏజెన్సీలోనే పనిచేస్తున్నారు. వీరిలో 50 ఏళ్లు పైబడినవారు, పలు రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు ఉన్నారని వారంతా వాపోతున్నారు. 60 ఏళ్లు పైబడిన తహశీల్దార్ ఒకరు తనను మైదానంలోకి బదిలీ చేయాలని ఏడాదిగా కోరుతున్నారు. ఇందుకు అనుగుణంగా ఏజెన్సీలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు ఇటీవల విశాఖ కలెక్టర్‌ను కలిసి తమను మైదానంలోకి బదిలీ చేయాలని వినతిపత్రం అందజేశారు. 50 ఏళ్లు వయసు దాటిన ఉద్యోగులను ఏజెన్సీకి బదిలీ చేయరాదని, ఒకవేళ చేసినా రెండేళ్ల తరువాత తిరిగి మైదానానికి పంపాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కాగా నిబంధనల మేరకు బదిలీలు చేసి.. ఏజెన్సీలో పనిచేసిన వారిని మైదానానికి పంపించకపోతే కొందరు కోర్టును ఆశ్రయించాలని యోచిస్తున్నారు. అయితే విశాఖలో ఐదేళ్లకు మించి పనిచేస్తున్న వారిని ఏజెన్సీకి పంపేందుకు అధికార యంత్రాంగం నిర్ణయించిందన్న సంకేతాలు వస్తున్నాయి. ఇదిలావుండగా తమకు అనుకూల ప్రాంతాల్లో పోస్టింగుల కోసం ఇప్పటికే పలువురు ఉద్యోగులు పైరవీలు సాగిస్తున్నారు.

ఆయిల్ పామ్ తోటల్లో గంజాయి డెన్

... 5వ పేజీ తరువాయి

బొడ్డు నానాజీ, నర్సీపట్నం మండలం, దుగ్గాడకు చెందిన నల్లబెల్లి అంజిబాబు, నర్సీపట్నం మునిసిపాలిటీకి చెందిన కడిమి రాజేశ్ సహకరించారు. ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిలో తొలుత 600 కిలోల సరకును నాలుగు రోజుల క్రితం కారులో మల్కన్‌గిరి జిల్లా నుంచి సీలేరు, మారేడుమిల్లి మీదుగా రోలుగుంట మండలం కొంతలం- అడ్డసరం గ్రామాల మధ్య వున్న ఆయిల్‌పామ్ తోటల వద్దకు చేర్చారు. గురువారం తెల్లవారుజామున మరో 150 కిలోల గంజాయిని కారులో నిల్వ స్థావరం వద్దకు తీసుకువచ్చారు. అప్పటికే మాటువేసిన పోలీసులు వాహనాన్ని పట్టుకున్నారు. కారులో వున్న గంజాయితోపాటు ఆయిల్ పామ్ తోటలో నిల్వ చేసిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారయ్యారు. ఒక కారు, మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని తూకం వేసి 750 కిలోలు వున్నట్టు నిర్ధారించారు. వియ్యపు గోవిందకు ఇప్పటికే నాలుగు నల్లబెల్లి అంజిబాబుపై రెండు గంజాయి కేసులు వున్నాయి. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. భారీ మొత్తంలో గంజాయిని, నిందితులను పట్టుకున్న రోలుగుంట ఎస్ఐరామకృష్ణారావు, కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ప్రశంసా పత్రాలు, నగదు రివార్డులను అందించారు. మీడియా సమావేశంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రావణి, కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కేకే లైన్‌లో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు

అరకులోయ/అనంతగిరి, మే 29 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస-కిరండూల్ (కేకే) లైన్‌లో అనంతగిరి మండలం త్రైడ-చిమిడిపల్లి స్టేషన్ల మధ్య బుధవారం గూడ్స్ రైలు పట్టాలు తప్పిన సంఘటనలో పునరుద్ధరణ పనులు గురువారం కూడా కొనసాగాయి. 33 గూడ్స్ బోగీలు పట్టాలు తప్పడం, వీటిలో మూడు బోగీలు టన్నెల్‌లో పట్టాలు తప్పడంతో వాటిని తొలగించడం కష్టంగా ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. డీఆర్ఎం, ఏడీఆర్ఎం, ఇతర రైల్వే అధికారుల పర్యవేక్షణలో పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నాటికి పనులు పూర్తి కావచ్చని భావిస్తున్నారు.

86 మంది హెచ్ఎంలు బదిలీ

... 5వ పేజీ తరువాయి

నిర్వహించారు. స్కూలు అసిస్టెంట్లలో సీనియారిటీ జాబితా ఖరారుచేసి 67 ఉన్నత పాఠశాలల హెచ్ఎంలుగా నియమించారు. వీరిలో జడ్పీ పాఠశాలల్లో 66 మంది, మునిసిపాలిటీలో ఒకరు వున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో

ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బదిలీలు నిర్వహించారు. మొత్తం 13 మంది హెచ్ఎంలను వెబ్ ఆప్షన్ల ద్వారా బదిలీ చేశారు. ఇంకా ఖాళీగా ఉన్న హెచ్ఎం పోస్టుల భర్తీని గురువారం ఆర్జేడీ విజయభాస్కర్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఎనిమిది మంది స్కూల్ అసిస్టెంట్లకు హెచ్ఎంలుగా పదోన్నతి కల్పించారు.

క్రైం... crime news

కార్మికురాలి అనుమానాస్పద మృతి

ఎస్.రాయవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ సమీపంలో ఉన్న సాయి మెరైన్ రొయ్యల పరిశ్రమలో పని చేస్తున్న ఓ కార్మికురాలు బుధవారం రాత్రి అనుమానాస్పదంగా మృతిచెందింది. దీనికి సంబంధించి ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఒడిశాలోని కోరాపుట్ ప్రాంతానికి చెందిన హులకా అనిత(19) గత నెల రోజులుగా రొయ్యల పరిశ్రమలో పని చేస్తూ, అక్కడే ఉన్న వసతి గృహంలో ఉంటోంది. బుధవారం ఉదయం ఆమె పనికి వెళ్లింది. అయితే ఆరోగ్యం బాగోకపోవడంతో వసతి గృహానికి పంపేశారు. అదే రోజు రాత్రి ఆమె తీవ్ర అస్వస్థతకు గురై తన గదిలో అపస్మారకస్థితిలోకి వెళ్లిపోవడంతో రొయ్యల పరిశ్రమ యాజమాన్యం అంబులెన్స్‌లో నక్కపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కార్మికురాలి మృతిపై ఆ పరిశ్రమ మేనేజర్ రఘు నుంచి ఆర్ఐ మణికంఠ, వీఆర్వో రాజు వివరాలు సేకరించారు. అయితే కార్మికురాలు మృతి చెందిన విషయాన్ని యాజమాన్యం గోప్యంగా ఉంచడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

... 5వ పేజీ తరువాయి

తీసుకుంటామని చెప్పారు. వైసీపీ కౌన్సిలర్ బుల్లిదొర మాట్లాడుతూ, ఇప్పుడున్న వారికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారని ప్రశ్నించారు. యూనిట్ పెట్టడానికి రూ.లక్షలు ఖర్చు పెట్టారని, అవి తిరిగి ఇచ్చేస్తారా అని అడిగారు. కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ, ఆర్వో ప్లాంట్లకు ఎవరూ పెట్టుబడి పెట్టలేదని, ఒకవేళ అటువంటిది ఏమైనా ఉంటే పరిశీలిస్తామని అన్నారు. కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ అయిన అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం మునిసిపాలిటీకి రూ.21 కోట్లు మంజూరు చేయించారని, గత వైసీపీ ప్రభుత్వం మునిసిపాలిటీ అభివృద్ధికి ఏమి చేయలేదని విమర్శించారు. దీంతో చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి జోక్యం చేసుకుంటూ.. ఐదేళ్లలో అభివృద్ధి పనులు జరగలేదనడం సబబు కాదని అన్నారు. వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ.. గత 25-30 ఏళ్ల నుంచి పరిష్కారం కాని గచ్చపువీధి డ్రైనేజీ సమస్య పద్మావతి వల్ల పరిష్కారం అయినట్టు ప్రచారం చేసుకుంటున్నారని, ఈ సమయంలో ఎక్కువ కాలం టీడీపీనే అధికారంలో ఉందని ఎద్దేవా చేశారు. దీంతో టీడీపీ సభ్యుడు దనిమిరెడ్డి మధు, వైస్‌చైర్మన్‌రామకృష్ణ మధ్య వాగ్వాదం మొదలైంది. మధు మాట్లాడూ. గత నాలుగేళ్లలో ఇక్కడ చేసిన అభివృద్ధికి సంబంధించి రికార్డులు చూపించాలని, కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో ఎన్ని నిధులు మంజూరయ్యాయో రికార్డులు చూపిస్తామని సవాల్ విసిరారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం మరింత పెరిగింది. ఒక దశలో మధు తన స్థానంలో నుంచి బయటకు వచ్చి మైక్‌తో రామకృష్ణ వైపు దూసుకువచ్చారు. మునిసిపల్ అధికారులు, పోలీసులు అడ్డుకుని, సర్దుబాటు చేశారు. చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ, ఆర్వో ప్లాంట్ల అంశాన్ని వచ్చే నెలలో చర్చించి నిర్ణయం తీసుకోవచ్చుని, అజెండా నుంచి తొలిగిద్దామని అన్నారు. 20వ వార్డు కౌన్సిలర్ మూలపర్తి రామరాజు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో కొంత మంది లబ్ధిదారులకు టిడ్కో గృహాలు రద్దు చేసి స్థలాలు ఇచ్చారని, డిపాజిట్ డబ్బులు వెనక్కి ఇవ్వమని అడుగుతున్నారని తెలిపారు. కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ, డిపాజిట్ డబ్బులు వెనక్కి ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. టిడ్కో కాలనీల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి సెప్టెంబరులోగా లబ్ధిదారులకు ఫ్లాట్లు అప్పగిస్తామని అన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539